# ప్రజా తపన
prajathapana.com
News that matters





అల్పమైన విషయాలకై ప్రార్థించకండి, శరీర సుఖాల కోసం తాపత్రయపడితే మనుషులకు, జంతువులకు వ్యత్యాసం ఏముంటుంది?

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 41 శనివారం 25 మార్చి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# ఆన్ లైన్ కామర్స్ లో కొత్త నిబంధనలు

**ప్రజాతపన ,ముంబై,**




ఇంటర్నెట్ అందుబాటులోకి రావడంతో భారతదేశంలో ఆన్‌లైన్ రిటైల్ మార్కెట్ వేగంగా అభివృద్ధి చెందింది. మన దేశంలో ఈ-కామర్స్ వృద్ధికి ఇంకా భారీ అవకాశాలు ఉన్నాయి. అయితే ఆన్‌లైన్ మోసాల రూపంలో సమస్యలు కూడా పెరుగుతున్నాయి. ఇలాంటి సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించడానికి సన్నాహాలు చేసింది. రిపోర్ట్‌ల ప్రకారం, త్వరలోనే కొత్త, మరింత కఠినమైన నిబంధనలు జారీ చేయబోతోంది.జాతీయ వార్తాపత్రికల ప్రకారం, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ సహా అన్ని ఈ-కామర్స్ కంపెనీలకు నిబంధనలను కఠినతరం చేయడానికి కేంద్ర వినియోగదార్ల వ్యవహారాల మంత్రిత్వ శాఖ కసరత్తు చేస్తోంది. ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో జరిగే మోసాలకు సంబంధిత కంపెనీలను బాధ్యులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం. ఒక కంపెనీకి చెందిన ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లో విక్రేత వల్ల వినియోగదారు మోసపోతే, సంబంధిత సంస్థ మధ్యవర్తి పాత్రను పోషించడంలో విఫలమైనట్లుగా పరిగణిస్తారు.ఆన్‌లైన్ షాపింగ్ మోసాలకు సంబంధించి, కేంద్ర ఎలక్ట్రానిక్స్ ‍ఌ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఈ-కామర్స్ కంపెనీలకు కొన్ని ప్రశ్నలను పంపింది. ఆ ప్రశ్నలపై ఆయా కంపెనీల నుంచి సమాధానాలు రాగానే నిబంధనలను అమలు చేయనున్నారు. కేంద్ర వినియోగదార్ల వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ఒక సీనియర్ అధికారి ఈ విషయాన్ని వెల్లడించినట్లు జాతీయ మీడియా రిపోర్ట్ చేసింది. కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఌ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ గత వారం ఈ-కామర్స్ కంపెనీలకు ఒక నోట్ పంపిందని సమాచారం. కేంద్ర వినియోగదార్ల వ్యవహారాల మంత్రిత్వ శాఖ రూపొందించిన ప్రశ్నల ఆధారంగా ఆ నోట్ రూపొందించారని తెలుస్తోంది. ఆ ప్రశ్నల్లో ముఖ్యమైన ప్రశ్న... మధ్యవర్తిగా ఆయా కంపెనీల పాత్రను స్పష్టం చేయాలని ఈ-కామర్స్ కంపెనీలను ఎలక్ట్రానిక్స్ ఌ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ అడిగిందిఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ 2000లోని సెక్షన్ 79 ప్రకారం... కొనుగోలుదార్లు -

(మిగతా 2లో)



## ఈడీ, సీబీఐ దాడులపై సుప్రీంలో పిటీషన్

**14 పార్టీల పిటీషన్ స్వీకరించిన న్యాయస్థానం**


**ప్రజాతపన ,న్యూఢిల్లీ:**

దేశవ్యాప్తంగా పలు చోట్ల సీబీఐ,ఈడీ దాడులు కొనసాగుతున్నాయి. బిహార్‌లో ల్యాండ్ ఫర్ జాబ్ స్కామ్ విచారణ జరుగుతోంది. ఢిల్లీలో లిక్కర్ స్కామ్ వేడి ఇంకా చల్లారలేదు. అయితే ఈ దాడులపై ప్రతిపక్షాలు భగ్గుమంటు న్నాయి. ప్రతిపక్ష పార్టీలను అణిచివేసేందుకు దర్యాప్తు సంస్థల్ని పావులుగా వాడుకుంటున్నాయని తీవ్రంగా ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలోనే 14 ప్రతిపక్ష పార్టీలు సుప్రీంకోర్టుని ఆశ్రయించాయి. కేంద్రానికి వ్యతిరేకంగా పిటిషన్ వేశాయి. ప్రతిపక్షాలపై పక్షపాత ధోరణితో దాడులు చేయిస్తోందని ఆ పిటిషన్‌లో తెలిపాయి. ఈ పిటిషన్‌ను పరిశీలించిన సర్వోన్నత న్యాయస్థానం.. .విచారణకు అంగీకరించింది. ఏప్రిల్ 5వ తేదీన వాదనలు వింటామని స్పష్టం చేసింది. కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ పార్టీ, రాష్ట్రీయ జనతా దళ్, తృణమూల్ కాంగ్రెస్, ఆఓఐ సహా మరి కొన్ని పార్టీలు

(మిగతా 2లో)

## రాముడు అందరి వాడు-ఫరూక్ అబ్దుల్లా

**శ్రీనగర్ :**



జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా మరోసారి రాముడిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలందరికీ మంచి మార్గంలో నడిపించేందుకు శ్రీరాముడిని స్వయంగా అల్లాయే పంపాడని అన్నారు. రాముడు అందరి దేవుడు అని వెల్లడించారు. ఓ ర్యాలీలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. “రాముడు కేవలం హిందువులకు మాత్రమే దేవుడు కాదు. అలాంటి ఆలోచనను

(మిగతా 2లో)


## ఒకే రోజు 100 మందికి సన్యాసం



**ప్రజాతపన ,న్యూఢిల్లీ:**

యోగా గురు బాబా రామ్ దేవ్ బాబా ఓ కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించ నున్నారు. రామ నవమి రోజున 100 మంది మహిళలు, పురుషులను సన్యాసులుగా మార్చనున్నారు. పతంజలి యోగపీఠ చైత్ర నవరాత్రి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టింది. ఇందులో భాగంగా రామ్ దేవ్ బాబా సమక్షంలో 40 మంది మహిళలు,

(మిగతా 2లో)



## రాహుల్ గాంధీ పై అనర్హత వేటు

**ప్రజాతపన ,న్యూఢిల్లీ:**

మోదీ ఇంటి పేరుకలవారందరూ దొంగలే అంటూ వ్యాఖ్యానించి రెండేళ్ల జైలుశిక్ష పొందిన కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ పై అనర్హత వేటు పడింది. దీనికి సంబంధించి లోక్‌సభ సెక్రటేరియట్ నుంచి సర్క్యులర్ జారీ అయింది. 1951 ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 8(3) ప్రకారం ఆయనపై అనర్హత పడింది. సూరత్ కోర్ట్ తీర్పు ప్రకారం లోక్‌సభ సెక్రటేరియట్ ఆయనపై వెంటనే చర్యలకు దిగింది.

**సర్క్యులర్‌లో ఏముందంటే..**

“ కేరళలోని వయనాడ్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రాహుల్ గాంధీని సూరత్ కోర్ట్ ఆఫ్ చీఫ్ జుడీషియల్ మేజిస్ట్రేట్ దోషిగా తేల్చడంతో లోక్‌సభ సభ్యత్వం నుంచి అనర్హత వేటు

(మిగతా 2లో)

## రాష్ట్రపతి నిలయం సందర్శనకు.. రెడ్ కార్పెట్



**వారానికి 6 రోజులు విజిట్**

**ప్రజాతపన ,హైదరాబాద్ :**

రాష్ట్రపతి నిలయం.... సికింద్రాబాద్ లోని బొల్లారం ఉంటుంది. ఇప్పటివరకు ఏడాదిలో ఒక్కసారి మాత్రమే సందర్శకులను అనుమతి ఉండేది. అయితే ఇక ఏడాది పొడవునా చూసే అవకాశం వచ్చేసింది. ఈ మేరకు రాష్ట్రపతి నిలయం సందర్శనకు అనుమతించే కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము వర్చువల్ గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, తెలంగాణ హోం మంత్రి మహమ్మద్ మహమూద్ అలీ తదితరులు పాల్గొన్నారు. ఫలితంగా ఇక ప్రతిరోజూ రాష్ట్రపతి నిలయాన్ని చూసే అవకాశం దక్కనుంది.

చారిత్రక కట్టడాలు, పూల తోటలు, పండ్ల తోటలతో ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది రాష్ట్రపతి నిలయం. గతంలో ప్రెసిడెంట్ శీతాకాల విడిది తర్వాత 15 రోజులు మాత్రమే సందర్శకుల కోసం తెరిచి ఉంచేవారు. ఇక నుంచి రాష్ట్రపతి విడిది చేసే డిసెంబర్ నెల మినహా అన్ని రోజుల్లోనూ సాధారణ ప్రజలను సందర్శనార్థం అనుమతించనున్నారు.

(మిగతా 2లో)

# ఆన్ లైన్ కామర్స్ లో కొత్త నిబంధనలు

(మొదటిపేజీ తరువాయి)



అమ్మకందార్లను అనుసంధానించే మధ్యవర్తులుగా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, స్నాప్‌డీల్ సహా అన్ని ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లను పరిగణిస్తారు. సంబంధిత సెక్షన్ కింద వినియోగదార్లకు కొంత రక్షణ మాత్రమే లభిస్తుంది. అయితే, ఈ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం మార్చాలని అనుకుంటోంది. మధ్యవర్తిగా ఈ-కామర్స్ ప్లాట్‌ఫారమ్ మరింత బాధ్యత వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.భారతదేశంలోని ఈ-కామర్స్ కంపెనీలపై కేంద్ర ప్రభుత్వం కఠినంగా ఉండడం ఇదే మొదటిసారి కాదు. ఇంతకు ముందు, 2020 జులైలో కొత్త ఈ-కామర్స్ నిబంధనలను ప్రభుత్వం నోటిఫై చేసింది. కొత్త నిబంధనల్లో, ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లకు సంబంధించిన వ్యవస్థలను విక్రేతలుగా మార్చడం, ఫ్లాష్ సేల్స్‌పై నిషేధం వంటి కఠిన నిబంధనలు రూపొందించింది. ప్రభుత్వ నిబంధనలను అటు అగ్ర ఈ-కామర్స్ కంపెనీలు, ఇటు నీతి ఆయోగ్ వంటి ప్రభుత్వ థింక్ ట్యాంక్‌లు కూడా హర్షించలేదు. మరోవైపు, ఈ-కామర్స్ కంపెనీలపై కఠినంగా వ్యవహరించాలని చిన్న చిల్లర వ్యాపారుల సంస్థ క్యాట్ చాలా కాలంగా డిమాండ్ చేస్తోంది.

# ఈడీ, సీబీఐ దాడులపై సుప్రీంలో పిటీషన్

(మొదటిపేజీ తరువాయి)

ఈ పిటిషన్ వేశాయి. బీజేపీలో చేరగానే అన్ని ఈ దాడులు ఆపేస్తున్నారని విమర్శించాయి. బీజేపీ మాత్రం ఈ విమర్శలను కొట్టి పారేస్తోంది. దర్యాప్తు సంస్థలు చట్టప్రకారమే నడుచుకుంటు న్నాయని తేల్చి చెబుతోంది. స్వతంత్రంగా పని చేస్తున్నాయని వివరిస్తోంది. సీనియర్ కౌన్సిల్ అభిషేక్ మను సింఘ్వీ ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ డివై చంద్రచూడ్ వద్ద ప్రస్తావించారు. అత్యవసర విచారణ జరపాలన కోరారు. అఃఎ,ఇఆలను తమకు వ్యతిరేకంగా పని చేసేలా బీజేపీ ఉసిగొల్పుతోందని 14 పార్టీలు పిటిషన్ వేశాయని వివరించారు. దాదాపు 95% మేర కేసులు ప్రతిపక్ష నేతలపైనే ఉన్నాయని చెప్పారు. బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్‌కు సమన్లు జారీ చేసిన విషయాన్ని చెప్పారు. వీటన్నింటినీ పరిశీలించిన సుప్రీం కోర్టు ఏప్రిల్ 5న విచారిస్తామని వెల్లడించింది.

ల్యాండ్ ఫర్ జాబ్ స్కామ్‌ల్యాండ్ ఫర్ జాబ్ స్కామ్ కేసు విచారణకు హాజరవుతానని బిహార్ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ ఢిల్లీ హైకోర్టులో వెల్లడించారు. మార్చి 25న కోర్టులో హాజరవుతానని తెలిపారు. ఇప్పటికే సీబీఐ మూడు సార్లు ఆయనకు నోటీసులు పంపింది. కానీ ప్రతిసారి ఏదో ఓ కారణం చెబుతూ హాజరు కాలేదు. ఈ సారి మాత్రం తప్పకుండా వస్తానని హామీ ఇచ్చారు. సీబీఐ నోటీసులు పంపినా స్పందించకపోవడంపై ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై విచారణ జరిపిన కోర్టు...ఎందుకు హాజరు కావడం లేదని ప్రశ్నించింది. తేజస్వీ తరపున వాదించిన న్యాయవాది తన వాదనలు వినిపించారు. సీబీఐ ఎదుట హాజరైతే ఆయనను అరెస్ట్ చేసే అవకాశాలున్నాయని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరవుతారని అన్నారు. బడ్జెట్ సమావేశాల కారణంగా ఏప్రిల్ 5వ తేదీ తరవాతే సీబీఐ హెడ్‌క్వార్టర్స్‌కు వెళ్తారని వివరించారు. ఈ వాదనలు విన్న సీబీఐ తేజస్వీని అరెస్ట్ చేసే ఆలోచనే లేదని తేల్చి చెప్పింది.

# రాహుల్ గాంధీ పై అనర్హత వేటు

(మొదటిపేజీ తరువాయి)

పడింది. దోషిగా తేలిన 23 మార్చి 2023 నుంచి నుంచి అనర్హత వర్తిస్తుంది. భారత రాజ్యాంగం ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 సెక్షన్ 8లోని ఆర్టికల్ 102(1)(ఇ) ప్రకారం నిర్ణయం తీసుకున్నాం" అని పేర్కొంటూ లోక్‌సభ సెక్రటరీయేట్ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ సర్క్యులర్ జారీ చేశారు.

ఈ కేసులో సూరత్ కోర్ట్ ప్రస్తుతానికి కోర్టు 30 రోజుల బెయిల్ ఇచ్చినా తర్వాత ఆయనకు న్యాయపరమైన చిక్కులు ఎదురుకాబోతున్నాయి. పై కోర్టులు కనుక సూరత్ కోర్ట్ తీర్పును కొట్టేయకపోతే రాహుల్ ఎనిమిదేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయలేరు. అయితే సూరత్ కోర్ట్ తీర్పుపై ఉన్నత న్యాయస్థానానికి వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది.

రాహుల్‌పై సూరత్ కోర్ట్ ఇచ్చిన తీర్పుపై చట్ట ప్రకారం ముందుకెళ్తామని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. బీజేపీ ఇలా చేస్తుందని తాము ముందే ఊహించామన్నారు. రాహుల్ నోరు నొక్కడానికే ఇలా చేశారని విమర్శించారు.అటు తన సోదరుడు భయపడే రకం కాదని, భయపడబోడని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీచెప్పారు. నిజం చెప్పడమే అలవాటని, నిజమే చెబుతామన్నారు. రాహుల్ నోరు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ భాగేల్ రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్కూడా బీజేపీ రాహుల్ గొంతు నొక్కే యత్నం చేస్తోందని విమర్శించారు మరోవైపు పరువు నష్టం కేసులో తనకు రెండేళ్ల జైలు శిక్ష పడటంపై రాహుల్ స్పందించారు. సత్యమే తనకు గురువని చెప్పారు. తన ధర్మం సత్యం, అహింసలపై ఆధారపడిందన్నారు. మోదీ ఇంటి పేరు కలవారందరూ దొంగలే అంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలపై కేసు పెట్టిన బీజేపీ ఎమ్మెల్యే పూర్ణేశ్ మోదీకోర్టు తీర్పును స్వాగతించారు. ఐపీసీ సెక్షన్ 499, 500 ప్రకారం సూరత్ కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించింది. అప్పీల్ చేసుకునేందుకు 30 రోజుల బెయిల్ ఇచ్చింది.

# రాముడు అందరి వాడు-ఫరూక్ అబ్దుల్లా

(మొదటిపేజీ తరువాయి)

పక్కన పెట్టేయండి. రాముడు అందరివాడు. అందరికీ ఆయన దేవుడే. ముస్లిమైనా, క్రిస్టియనైనా...అంతెందుకు అమెరికన్ అయినా, రష్యన్ అయినా నమ్మకం ఉన్న ప్రతి ఒక్కరికీ ఆయన దేవుడే" - ఫరూక్ అబ్దుల్లా, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఇదే సమయంలో పాకిస్థానీ రచయిత చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు ఫరూక్ అబ్దుల్లా. "ఎవరైతే తాము రాముడి భక్తులం అని చెప్పుకుంటూ తిరుగుతున్నారో వాళ్లంతా మూర్ఖులే. కేవలం ఆయన పేరు చెప్పుకుని బతికేస్తున్నారంతే. వాళ్లకు రాముడిపై భక్తి, ప్రేమ ఉండవు. కేవలం అధికారం కోసమే అలా మాట్లాడుతుంటారు" - ఫరూక్ అబ్దుల్లా, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి జమ్ముకశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించే సమయంలో ప్రజల దృష్టిని మరల్చేందుకు అదే సమయంలో అయోధ్య రామ మందిరాన్ని ప్రారంభించే అవకాశాలున్నాయని అన్నారు. జమ్ము కశ్మీర్ ఎన్నికల కోసం కేంద్రం భారీ మొత్తంలో ఖర్చు చేసే అవకాశముందని చెప్పారు. హిందువులంతా ప్రమాదంలో ఉన్నారని ప్రచారం చేస్తారని..అలాంటి మాటల్ని పట్టించుకోవద్దని సూచించారు. గతంలోనూ ఫరూక్ ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. "రాముడు అందరివాడు. ఆయనను హిందూ మతానికే పరిమితం చేయాల్సిన అవసరం లేదు" అని వెల్లడించారు. ఏ మతమూ చెడు నేర్పించదని, ప్రజలే అలా తయారవుతారని తెలిపారు. "మాపై నిత్యం ఆరోపణలు చేస్తూనే ఉంటారు. కానీ మేమెప్పుడూ పాకిస్థాన్ సైడ్ తీసుకోలేదు. వారితో ఎప్పుడూ స్నేహం చేయలేదు. మా నాన్నను కలవడానికి జిన్నా వచ్చారు. కానీ మేము కనీసం ఆయనకు షేక్ హ్యాండ్ కూడా ఇవ్వలేదు" అని తేల్చి చెప్పారు. జమ్ముకశ్మీర్‌లోని యువతకు ఉద్యోగాలు ఇస్తామన్న కేంద్ర ప్రభుత్వం..ఆ మాట నిలబెట్టుకోలేక పోయిందని విమర్శించారు. "మనకు 50 వేల ఉద్యోగాలు ఇస్తామన్నారు..? ఆ హామీ ఏమైంది" అని ప్రశ్నించారు. తరచూ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు ఫరూక్. త్వరలోనే ఎన్నికలు నిర్వహించాలని ఇటీవలే ఎన్నికల సంఘాన్ని కోరారు.

# రాష్ట్రపతి నిలయం సందర్శనకు.. రెడ్ కార్పెట్

(మొదటిపేజీ తరువాయి)

ఇక వారానికి ఆరు రోజులు (సోమవారాలు , ప్రభుత్వ సెలవులు మినహా) ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించవచ్చు.రాష్ట్రపతి భవన్ సందర్శించే భారతీయులకు ప్రతి వ్యక్తికి రూ. 50గా నిర్ణయించారు. అదే విదేశీయులైతే రూ. 250గా ఎంట్రీ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. 160 ఏండ్లకు పైగా చరిత్ర కలిగిన రాష్ట్రపతి నిలయం హెరిటేజ్ భవనాలు, ఆర్ట్ గ్యాలరీ, అండర్ గ్రౌండ్ టన్నెల్, ఆవరణలు, గార్డెన్లు, జై హింద్ ర్యాంప్, హెరిటేజ్ ఫ్లాగ్ పోస్ట్ సైట్ వంటి వాటిని చూడొచ్చు.ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు సందర్శించే అవకాశం ఉంటుంది. ప్రవేశం మాత్రం సాయంత్రం 4 గంటల వరకే ఇస్తారు. రాష్ట్రపతి భవన్ అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. వచ్చే వారి కోసం పార్కింగ్ సౌకర్యం, వస్తువులు భద్రపరుచుకొనే గది, రెస్ట్‌రూమ్స్, ఆర్వో వాటర్, క్యాంపస్‌లో డిస్పెన్సర్లు, ఫస్ట్ ఎయిడ్ సెట్‌తోపాటు ఉచిత గైడ్‌వంటి సకల సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి.సికింద్రాబాద్ నుంచి సిద్దిపేటకు వెళ్లే దారిలో సికింద్రాబాద్‌కు 10 కిలోమీటర్ల దూరంలో బొల్లారంలో లోతుకుంట అనే ప్రాంతానికి దగ్గర్లో రాష్ట్రపతి నిలయం ఉంది. దీన్ని పురాతన, వారసత్వ కట్టడంగా ప్రభుత్వం ప్రకటించింది. సుమారు 70 ఎకరాల విస్తీర్ణంలో, దట్టమైన పురాతన చెట్ల నీడలో రాష్ట్రపతి నిలయం కొలువుదీరి ఉంటుంది. రాష్ట్రపతి నిలయం ఢిల్లీతో పాటు, హైదరాబాద్‌లోని బొల్లారం, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర రాజధాని సిమ్లాలో రాష్ట్రపతి రిట్రీట్‌లు ఉన్నాయి. రాష్ట్రపతి ఉత్తరాదికే పరిమితం కాకుండా ఇతర ప్రాంతాల్లోని స్థానిక ప్రజా సమస్యలపై ఒక అవగాహన కోసమని దక్షిణాది రాష్ట్రాల వారి కోసం హైదరాబాద్‌లో అలాగే మరొకటి సిమ్లాలో ఏర్పాటు చేశారు.

# ఒకే రోజు 100 మందికి సన్యాసం

(మొదటిపేజీ తరువాయి)

60 మంది పురుషులు సన్యాసం తీసుకోనున్నారు. దీంతో పాటు 500 మంది మహిళలు, పురుషులు బ్రహ్మచర్యం తీసుకోనున్నారు. ఇటీవలే మహాప్రాణ యజ్ఞం పూర్తి చేసిన సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు రామ్‌దేవ్ బాబా వెల్లడించారు. హిందూ సనాతన ధర్మాన్ని రక్షించేందుకు, ఆ ధర్మం బోధించిన సన్యాసులకు గౌరవమిచ్చేందుకు ఈ కార్యక్రమం మొదలు పెట్టినట్టు తెలిపారు. వేదాల్లోని సారాన్ని అధ్యయనం చేసిన వాళ్లు, సనాతన ధర్మాన్ని గౌరవించే వారికి ఈ అవకాశం కల్పిస్తున్నట్టు వివరించారు. భారత దేశ సనాతన ధర్మాన్ని కాపాడటంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు."పతంజలి యోగపీఠ్‌లో మహిళలు, పురుషులు అన్న తేడాలు ఉండవు. కులం, మతం ఆధారంగా విడదీయం. వీళ్లంతా ప్రపంచవ్యాప్తంగా సనాతన ధర్మాన్ని ప్రచారం చేస్తారు. ఇంకొంత మంది సన్యాసం తీసుకునేలా చొరవ చూపిస్తారు. రామ రాజ్యం నాటి రోజులను తిరిగి తీసుకురావాలన్నదే మా ఆకాంక్ష. రామ మందిర నిర్మాణంతో ఆ కల సాకారమవుతుంది. ఇది జాతీయ ఆలయంగా చిరస్థాయిలో నిలబడి పోతుంది' 'ఇదే సమయంలో జమ్ముకశ్మీర్ సహా పలు కీలక అంశాలనూ ప్రస్తావించారు రామ్‌దేవ్ బాబా. ముఖ్యంగా బీజేపీ అజెండాలోని విషయా లపై మాట్లాడారు. "అయోధ్య రామ మందిరం వచ్చే జనవరి నాటికి పూర్తవుతుంది. జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేశారు. వీటితో పాటు ఇంకొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. యూనిఫామ్ సివిల్ కోడ్ అమలు చేయాలి. జనాభా నియంత్రణకు కొత్త చట్టం తీసుకురావాలి. వచ్చే ఏడాది నాటికి ఈ రెండు పనులూ పూర్తవుతాయని ఆశిస్తున్నాను"రామజన్మ భూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ట్రెజరర్ స్వామి గోవింద్ దేవ్ గిరి సన్యాస్ దీక్ష ప్రోగ్రామ్‌ను ప్రారంభించిన సమయంలో కీలక వ్యాఖ్యలు చేశారు. దాదాపు 15 వందల మంది యువత..సన్యాసం తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారని చెప్పారు. ఇలాంటి చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకోవడంలో, వాటిని అమలు చేయడంలో స్వామి రామ్‌దేవ్ బాబా విజయం సాధించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పాల్గొననున్నారు. గతంలోనూ రామ్ దేవ్ బాబా ఇదే విధంగా 100 మందిని సన్యాసం తీసుకునేలా చొరవ చూపించారు. హిందూ ధర్మాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నారు.

# సీసీ టీవీ ఫుటేజ్‌లో దొరికిపోయిన పేపర్ ఎక్స్ఛేంజ్ వ్యవహారం

**హైదరాబాద్:**

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసు రిమాండ్ రిపోర్ట్‌లో కీలక అంశాలు వెలుగు చూశాయి. ఇప్పటి వరకూ 12 మంది నిందితులను ఆరెస్ట్ చేసినట్టు రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ పేర్కొంది. తొమ్మిది మంది నిందితులతో పాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు. ముగ్గురిలో ఇద్దరు టీఎస్‌పీఎస్సీ ఉద్యోగులు ఉన్నారు. ఇప్పటి వరకూ మొత్తంగా నలుగురు టీఎస్‌పీఎస్సీ ఉద్యోగులను అధికారులు అరెస్ట్ చేశారు. ం1ప్రవీణ్ టీఎస్‌పీఎస్సీ సెక్రెటరీ పీఏ, ం2 రాజశేఖర్, నెట్వర్క్ అడ్మిన్, ం10 షమీమ్ ఏఎస్ఓ, ం12 రాజశేఖర్ డాటా ఎంట్రీ ఆపరేటర్ అరెస్టైన వారిలో ఉన్నారు.

నిందితుల్లో మరో నలుగురు ప్రభుత్వ ఉద్యోగులున్నట్టు రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ పేర్కొంది. 19 మంది సాక్ష్యులను విచారించినట్టు రిమాండ్ రీపోర్ట్‌లో సిట్ పేర్కొంది. టీఎస్‌పీఎస్సీ ఉద్యోగి శంకర్ లక్ష్మిని ప్రధాన సాక్షిగా సిట్ పేర్కొంది. శంకర్ లక్ష్మితో పాటు టీఎస్‌పీఎస్సీ, తెలంగాణ స్టేట్ టెక్నీకల్ సర్వీస్ ఉద్యోగులను సాక్షులుగా సిట్ వెల్లడించింది. కర్మన్ ఘాట్‌లోని ఒక హోటల్‌లోని యాజమని, ఉద్యోగిని సాక్షిగా సిట్ తెలిపింది. హోటల్‌లోని సీసీటీవి కెమెరాలో పేపర్ ఎక్స్ఛేంజ్ వ్యవహారం నిక్షిప్తమైంది. ప్రవీణ్, రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు షమీమ్, రమేష్, సురేష్ లను సిట్ అరెస్ట్ చేసింది. ముగ్గురు నిందితుల నుంచి ఒక ల్యాప్ టాప్, మూడు మొబైల్ ఫోన్స్‌ను సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

# పాదయాత్రలో హామీలు అమలు

**విజయవాడ:**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ రెండు కీలక తీర్మానాలకు ఆమోదం తెలిపింది. బోయ, వాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు, అలాగే దళిత క్రిస్టియన్లను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఏపీ అసెంబ్లీ తీర్మానాలు చేసింది. ఈ తీర్మానాలను కేంద్రానికి పంపుతున్నట్లు ప్రకటించారు సీఎం జగన్. పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఈ రెండు తీర్మానాలు కేంద్రానికి పంపుతున్నా మన్నారు. పాదయాత్ర సమయంలో ఎస్టీల్లో చేర్చాలని బోయ, వాల్మీకి కులస్థులు కోరారన్నారు. ఎన్నికల టైంలో ఇచ్చిన హామీ మేరకు బోయ, వాల్మీకి కులస్థుల పరిస్థితులపై వన్ మ్యాన్ కమిషన్ ఏర్పాటుచేశామన్నారు. రాయలసీమ ప్రాంతంలో బోయ, వాల్మీకి కులాల ఆర్థిక, సామాజిక పరిస్థితులపై కమిషన్ ప్రభుత్వానికి నివేదిక అందించిందన్నారు. ఈ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేశామని సీఎం జగన్ తెలిపారు. ఎస్టీలు తనను గుండెల్లో పెట్టుకున్నారన్న సీఎం... వారిని కూడా అలాగే గుండెల్లో పెట్టుకుంటానన్నారు. ఈ తీర్మానంపై ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. ఏజెన్సీలో ఉన్న ఎస్టీ కులాలపై దీని ప్రభావం ఉండదన్నారు. దళిత క్రిస్టియన్లను ఎస్సీల జాబితాలో చేర్చేందుకు తీర్మానం చేశామన్నారు. దివంగత నేత వైఎస్ఆర్ హయాంలో ఈ తీర్మానం చేశారని గుర్తుచేశారు

# 13.99 శాతానికి అప్పులు

**విజయవాడ,:**

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక స్థితిగతులపై ఆడిట్ నివేదికను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) సమర్పించింది. 2022 మార్చి 31 తేదీతో ముగిసిన సంవత్సరానికి సంబంధించిన నివేదికను కాగ్ కార్యాలయం అందజేసింది. 2021-22 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వ మొత్తం అప్పులు రూ. 3,72,503 కోట్లుగా ఉన్నాయని పేర్కొంది. ఇందులో 90 శాతం మేర రుణాలు.. 13.99 శాతం వడ్డీ తో తీసుకున్నారని తెలిపింది. 2018 నుంచి 2022 వరకూ అంతర్గత రుణాలు 77.54 శాతం మేర పెరిగాయి. గడిచిన 5 ఏళ్లలో తలసరి రుణం 61 శాతం మేర పెరిగింది, బడ్జేటేతర రుణాలు కూడా కలిపితే తలసరి రుణ భారం 92,797గా నమోదైంది. వచ్చే ఏడేళ్లలోగా రాష్ట్ర ప్రభుత్వం 1,29,817 కోట్ల రుణాల్ని తీర్చాలని కాగ్ తన నివేదికలో వెల్లడించింది కేంద్ర ప్రభుత్వ పథకాలకు మ్యాచింగ్ గ్రాంట్లు ఇవ్వకపోవడం వలన కేంద్ర పథకాల ద్వారా వచ్చిన రూ. 6,356 కోట్ల గ్రాంట్ మురిగిపోయిందని తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే చెల్లించాల్సిన రుణాలు రూ. 24,257 కోట్ల మేర పెరిగాయని పేర్కొంది. మొత్తం బడ్జెటేతర రుణాలు రూ. 1,18,394 కోట్లు నమోదయ్యాయి. డిస్కమ్‌లు, నీటిపారుదల ప్రాజెక్టులకు చెల్లించాల్సిన బకాయిలు మరో రూ. 17,804 కోట్లు ఉన్నాయి. వీటినీ బడ్జెట్‌లో చూపకపోవడంతో కీలకమైన మౌలిక సదుపాయాల కల్పన నిధులపై శాసనసభ నియంత్రణ కోల్పోయే ందుకు కారణమైంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఏపీ 18.47 శాతం జీఎస్డీపీ వృద్ధి రేటు నమోదు చేసిందని కాగ్ తెలిపింది. రూ. 688 కోట్ల రెవెన్యూ వ్యయాన్ని మూలధన వ్యయమని తప్పుగా వర్గీకరించారు. నవరత్నాల్లో భాగంగా వైఎస్ఆర్ గృహవసతి పథకాన్ని మూలధన వ్యయంగా ప్రభుత్వం చూపింది. లబ్ధిదారులకు ఇచ్చే ఇళ్ల స్థలాలు, ఇళ్లను రెవెన్యూ వ్యయంగా చూపాల్సి ఉందని కాగ్ తెలిపింది. బడ్జెట్‌లో చూపని అదనపు రుణాలు పరిమితి కంటే అధికంగా ఉన్నాయి. స్మార్ట్ పట్టణాలు, కృషి వికాస్ యోజన, జాతీయ ఆరోగ్య మిషన్ లాంటి పథకాలకు రాష్ట్ర వాటా విడుదల కాకపోవటం వల్ల అవి సరిగా అమలు కాలేదు. రూ. 3540 కోట్లు విడుదల చేయాల్సి ఉన్నా రాష్ట్రం వివిధ పథకాలకు తన వాటా విడుదల చేయలేదని తెలిపింది. ప్రభుత్వ రంగ సంస్థలు చేసిన అప్పులను అకౌంట్లల్లో చూపలేదని, ప్రభుత్వం చెల్లించాల్సిన అప్పులను ఖాతాల్లో చూపించకపోవడం నేరమని కాగ్ పేర్కొందని పీఏసీ చైర్మన్ పయ్యావుల కేశవ్ అన్నారు. అవి ఏ ఖాతాల్లోకి పోతున్నాయో క్లారిటీ లేదని, నిధులను దారి మళ్లిస్తున్నారని తాము గతంలో చెబితే విమర్శించారని.. ఇప్పుడు కాగ్ అదే విషయం చెప్పిందని.. ఏపీలో ఆర్థిక విస్ఫోటం.. ఇదే విషయం కాగ్ చెప్పిందని పయ్యావుల వ్యాఖ్యానించారు. ఎఫ్ఆర్బీఎంను ఉల్లంఘించిందని, ప్రభుత్వ సంస్థల రుణాలను కూడా చెల్లించాల్సి ఉంటే ప్రభుత్వ ఖాతాల్లో చూపాల్సిందేనని, ప్రభుత్వ గ్యారంటీలను.. అప్పులను దాచారని కాగ్ తన నివేదికలో పేర్కొందని పయ్యావుల కేశవ్ అన్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# చట్టాలతో కోర్టు తరలింపా..

**గుంటూరు :**

ఏపీ హైకోర్టును తరలించాలంటే హైకోర్టుతో కలిసి రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉందని కేంద్ర స్పష్టం చేసింది. తెలుగుదేశం పార్టీ ఎంపీ కనమేడల రవీంద్రకుమార్ రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర న్యాయమంత్రి కిరణ్ రిజుజు సమాధానం ఇచ్చారు. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రాష్ట్ర హైకోర్టు అమరావతి లో ఏర్పాటైందన్నారు. హైకోర్టును కర్నూల్ కు తరలిచాంలంటే హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వం కలిసే నిర్ణయం తీసుకోవాలని ఇందులో కేంద్రం పాత్ర లేదన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తరలింపు ప్రస్తుతం న్యాయస్థానాల పరిధిలో ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగం లోని 214 నిబంధన ప్రకారం 2018లో కేంద్రం వర్సెస్ దన్ గోపాల్ రావు, ఇతరుల కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం అమరావతిలో ఏపీ హైకోర్టు ఏర్పాటు అయిందని కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ కు ఉమ్మడి హైకోర్టుగా ఉన్న అప్పటి హైదరాబాద్ హైకోర్టు, అప్పటి రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించి పునర్విభజన చట్టం ప్రకారం ఏపీ హైకోర్టు అమరావతిలో ఏర్పాటయిందన్నారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి హైకోర్టును అమరావతి నుంచి కర్నూలుకు తరలించేందుకు ప్రతిపాదించారని, సీఎం జగన్ మూడు రాజధానుల ప్రతిపాదలను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు అయ్యాయని కిరణ్ రిజిజు అన్నారు. మూడు రాజధానుల అంశంపై ఏపీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంతో పాటు రాజధాని అమరావతి నగరంలో, పరిసర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధిని చేపట్టాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజినల్ డెవలప్‌మెంట్ అథారిటీని ఆదేశించిందన్నారు. హైకోర్టు తరలింపుపై రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు అభిప్రాయాలు వెల్లడించాల్సి ఉందని కిరణ్ రిజిజు పేర్కొన్నారు. కర్నూలుకు హైకోర్టు తరలిస్తామని ఏపీ ప్రభుత్వం చట్టం చేసింది. కానీ అడుగు ముందుకు పడలేదు. నిజానికి అసెంబ్లీకి హైకోర్టును తరలించే అధికారం లేదని చట్టం చేసినంత మాత్రాన హైకోర్టును తరలించలేరన్న న్యాయనిపుణులు స్పష్టం చేశారు. న్యాయస్థానాలు ఎక్కడి నుంచి పని చేయాలనేది రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేయలేరని చెబుతున్నారు. అయితే మూడు రాజధానుల బిల్లును రాష్ట్ర ప్రభుత్వంవెనక్కి తీసుకుంది. న్యాయరాజధాని అనే అంశాన్ని ప్రస్తుతం పెద్దగా పట్టించుకోడం లేదు. సుప్రీంకోర్టులో కూడా న్యాయరాజధాని అంశాన్ని పక్కన పెట్టామని ప్రభుత్వ తరపు లాయర్ వాదించారు. ఇప్పుడు హైకోర్టు చట్ట ప్రకారమే ఏర్పాటయిందని... తరలించాలంటే.. హైకోర్టుతో కలిసి నిర్ణయం తీసుకోవాల్సి ఉందనికేంద్రం స్పష్టం చేసింది.

# బాస్ నోట... కౌలు రైతుల మాట...

**ఖమ్మం :**

తెలంగాణలోని కౌలు రైతులు తమ ఎజెండాలో లేరని, భూమిపై పట్టా హక్కులను కలిగిన వారినే రైతులుగా గుర్తిస్తామని ప్రకటిస్తూ వచ్చిన ముఖ్యమంత్రి అనూహ్యంగా గురువారం కౌలు రైతులను ఆదుకుంటామని ప్రకటించడం, అదికూడా ఎన్నికల ఏడాదిలో కౌలు రైతుల పట్ల కేసీఆర్ చొరవ తీసుకోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కౌలు రైతులను ఆదుకోవాలన్న సీఎం నిర్ణయం సరైనదే అయినప్పటికీ ఈ నిర్ణయం వెనకాల పొలిటికల్ మోటివ్ పై చర్చ జరుగుతోంది. ఎనిమిదేళ్ల పాలనలో కేసీఆర్ రైతులను పట్టించుకోవడం లేదని రైతు బంధు పేరుతో భూస్వాములకు దోచిపెడుతున్నాడని ప్రతిపక్షాలు పదే పదే ఆరోపిస్తున్నాయి. కేసీఆర్ చెబుతున్న రైతు సంక్షేమ పథకాలతో కౌలు రైతులకు నయాపైసా ఆసరా లేదనే విమర్శలు ఉన్నాయి. ఓ వైపు అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అనే నినాదంతో జాతీయ స్థాయిలో రాజకీయాలు చేయాలని చూస్తున్న కేసీఆర్ సొంత రాష్ట్రంలో కౌలు రైతులను గాలికి వదిలేశాడనే టాక్ ఎదురుదెబ్బగా మారే అవకాశం ఉంది. ఇక వచ్చే ఎన్నికల్లో తెలంగాణ కౌలు రైతాంగం విషయంలోనూ వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది.బీఆర్ఎస్ పేరుతో నేషనల్ పాలిటిక్స్‌లో చక్రం తిప్పాలని భావిస్తున్న సీఎం కేసీఆర్ తాజాగా భారీ ప్రకటన చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటలను పరిశీలనకు వెళ్లిన ముఖ్యమంత్రి రైతులతో పాటు కౌలు రైతులను కూడా ఆదుకుంటామని బిగ్ అనౌన్స్ మెంట్ చేశారు. వర్షాలతో పంటలు దెబ్బతిన్న రైతులలో ఆత్మస్థైర్యం నింపేలా ఎకరానికి 10 వేల చొప్పున పరిహారం అందజేస్తామని తెలిపారు. నిజమైన రైతులకే ఈ లబ్ధి చేకూరేలా ఈసారి అందజేస్తున్న పరిహారం విషయంలో కౌలు రైతులను సైతం పరిగణలోకి తీసుకుంటామని వెల్లడించారు. సీఎం చేసిన ఈ ప్రకటన ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. రాష్ట్రంలో 42 శాతం భూమి కౌలు రైతుల సాగులోనే ఉందని పోయిన సంవత్సరం రైతు స్వరాజ వేదిక జరిపిన స్టడీలో వెల్లడైంది. 20 జిల్లాలోని31 మండలాలకు చెందిన 34 గ్రామాల్లో 7,744 మంది రైతులపై నిర్వహించిన సర్వేలో 35.6 శాతం కౌలు రైతులు ఉన్నట్లు గుర్తించారు. కౌలు రైతుల విషయంలో ప్రభుత్వం ఇన్నాళ్లు కనీసం పట్టింపు లేనట్లుగా వ్యవహరించింది. కేసీఆర్ మానస పుత్రికగా చెప్పుకుంటున్న రైతుబంధు, రైతుబీమా, నష్టపరిహారం విషయంలో వీరిని అసలు రైతుగానే గుర్తించలేదు. పంటలు సాగుచేసేది కౌలు రైతులు అయితే పథకాల లబ్ధి భూ యజమానులకు చేరుతోందని ప్రతిపక్షాలు, రైతు సంఘాలు గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. సబ్సిడీలు సైతం అందక ప్రభుత్వ పరంగా కౌలు రైతులు అనాథలుగా మారారు. దీంతో సర్కార్ సాయం కౌలు రైతులకు అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ధరణి విషయంలో అసెంబ్లీ వేదికగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ ధరణి పోర్టల్ లో కౌలు రైతులు అనే కాలమ్ తొలగిస్తున్నామని కౌలు రైతులను పట్టించుకంటే అసలు రైతులకే మోసం వస్తుందని అన్నారు. కౌలు రైతుల విషయంలో ఇంతలా మాట్లాడిన సీఎం.. సడెన్ గా వారిని ఆదుకుంటామని చెప్పడం ఆశ్చర్యానికి గురి చేస్తోందనే మాట వినిపిస్తోంది.సీఎం కేసీఆర్ కౌలు రైతులకు పరిహారం అనేది ఇటీవల వర్షాలతో ప్రభావితం అయిన పంటల వరకే పరిమితం అవుతుందా లేక భవిష్యత్ లో వారి కోసం ఏదైనా కీలక నిర్ణయం తీసుకోబోతున్నారా అనేది ఆసక్తిగా మారింది. ఈ విషయాలన్ని గ్రహించే గులాబీ బాస్ తాజాగా కౌలు రైతుల దిశగా ఆలోచన చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. కేసీఆర్ మాటలను బట్టి చూస్తే వచ్చే ఎన్నికల నాటికి కౌలు రైతుల విషయంలో రైతుబంధు అమలు చేయడం లేదా అలాంటి మరో స్కీమ్ ప్రకటించినా ఆశ్చర్యపోనక్కర్లేదు అనే ఊహాగానాలు పొలిటికల్ సర్కిల్స్ లో వినిపిస్తున్నాయి.

# మళ్లీ 23 చుట్టూ రాజకీయం

**విజయవాడ :**

ఏపీలోని ఎమ్మెల్సీ కోటా ఎమ్మెల్యే ఎన్నికల్లో సంచలనం చోటుచేసుకుంది. టీడీపీ నుంచి బరిలోకి దిగిన అభ్యర్థిని పంచుమర్తి అనురాధ విజయం సాధించింది. ఆమె గెలవాలంటే.. వాస్తవానికి 22 ఓట్లు కావాలి. కానీ ఆమెకు 23 ఓట్లు పోలయ్యాయి. గెలిచేందుకు తగినంత మెజార్టీ లేకపోయినప్పటికీ టీడీపీ బరిలోకి దిగి.. అనూహ్య విజయం సాధించింది. టీడీపీ గత సార్వత్రిక ఎన్నికల్లో కేవలం 23 సీట్లు మాత్రమే గెలుచుకుంది. అందులో నుంచి నలుగురు ఎమ్మెల్యేలు కరణం బలరామకృష్ణమూర్తి, మద్దాళి గిరిధర్, వల్లభనేని వంశీ, వాసుపల్లి గణేష్‌కుమార్ .. అధికార వైసీపీకి మద్దతు పలికారు. దీంతో ఆ పార్టీ బలం 19కి పడిపోయింది. ఒకవేళ వైసీపీపై అసమ్మతి గళం వినిపిస్తున్న.. ఆనం రామనారాయణ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి.. టీడీపీకి ఓటు వేశారు అనుకున్నా.. టీడీపీ బలం 21కి చేరేది. కానీ అనురాధకు 23 ఓట్లు పోలయ్యాయి. దీన్ని బట్టి.. వైసీపీ నుంచి క్రాస్ ఓటింగ్ జరిగినట్లు పక్కాగా స్పష్టమవుతుంది.2014 ఎన్నికల్లో టీడీపీ 102 సీట్లు సాధించి అధికార పీఠం దక్కించుకుంది.. వైసీపీ 67 సీట్లతో ప్రతిపక్షానికి పరిమితమైంది. ఆ తర్వాత కాలంలో.. దాదాపు 23 మంది వైసీపీ ఎమ్మెల్యేలు అప్పటి అధికార టీడీపీలోకి జంప్ అయ్యారు. కట్ చేస్తే.. 2019 ఎన్నికల్లో వైసీపీ 151 సీట్లతో విజయకేతనం ఎగరవేసింది. టీడీపీ కేవలం 23 సీట్లకు పరిమితమైంది. తమ పార్టీ నుంచి లాక్కున్నఎమ్మెల్యేల సంఖ్యే ప్రస్తుతం టీడీపీకి మిగిలిందని వైసీపీ ఎమ్మెల్యేలు చంద్రబాబును ఎద్దేవా చేసేవారు. కట్ చేస్తే ఇది మూడవ నెల? 23వ తారీఖు 2023వ సంవత్సరం (23-3-2023). ఇదే రోజున 23 ఓట్లతో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి అనురాధ విజయం సాధించారు. ఇదంతా చూస్తుంటే.. 23 సంఖ్యతో టీడీపీకి విడదీయరాని అనుబంధం ఉందని కామెంట్స్ పెడుతున్నారు నెటిజన్స్.

# ఆరోగ్యమహిళ పేరుతో పరీక్షలు

**హైదరాబాద్ :**

మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం తెలంగాన సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న కార్యక్రమమే "ఆరోగ్య మహిళ". ఇప్పటి వరకు కలిపి 11,121 మందికి స్క్రీనింగ్ నిర్వహించారు. మొదటి 4,793 మంది మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా, ఇందులో 975 మందికి అవసమైన మందులు అందజేశారు. ఉన్నతస్థాయి వైద్యం అవసరం ఉన్నవారిని, సమీపంలోని రిఫెరల్ సెంటర్ పెద్దాసుపత్రికి తీసుకువెళ్ళి వైద్యం సేవలు అందేలా చూస్తున్నారు. ఆరోగ్య సమస్య ఉన్నప్పటికీ, కుటుంబ సభ్యులకు చెప్పుకోవడం ఇష్టం లేక కొందరు, వ్యాధిలక్షణాల పై అవగాహన లేక మరికొందరు, వ్యయ ప్రయాసలు ఓర్చే పరిస్థితి లేక ఇబ్బంది పడేవారు ఆరోగ్య మహిళ కేంద్రాలకు వెళ్లి ఉచితంగా వైద్యం, పరీక్షలు, మందులు పొందుతున్నారు 6328 మంది మహిళలు ఆరోగ్య మహిళ క్లినిక్స్ ను సందర్శించారు. వీరిలో 3753 మందికి రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, 884 మందికి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, 3783 మందికి నోటి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, 718 మందికి మూత్రకోష ఇన్ఫెక్షన్ల నిర్ధారణ పరీక్షలు, 1029 మందికి సూక్ష్మ పోషక లోప నిర్ధారణ పరీక్షలు, 777 మందికి థైరాయిడ్ పరీక్షలు, 477 మందికి విటమిన్ - డి లోప పరీక్షలు, 1294 మందికి సిబిపి పరీక్షలు నిర్వహించారు.సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు వైద్యారోగ్య శాఖ ప్రత్యేకంగా ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని చేపట్టింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8వ తేదీన వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు కరీంనగర్‌లో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. మొదటి దశలో రాష్ట్రవ్యాప్తంగా 24 జిల్లాల్లో 100 కేంద్రాల్లో వైద్య సేవలు మొదలయ్యాయి. దశల వారీగా 1200 కేంద్రాలకు విస్తరిస్తారు. ఈ కేంద్రాల్లో ప్రతి మంగళవారం ప్రత్యేకంగా మహిళలకే 8 రకాల వైద్య సేవలు అందిస్తున్నారు.

ఏమేం టెస్టులు చేస్తారంటే..

1, మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, ఇతర సాధారణ పరీక్షలు

2, ఓరల్, సర్వైకల్, రొమ్ము క్యాన్సర్ల స్క్రీనింగ్..

3, థైరాయిడ్ పరీక్ష, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించడం. అయోడిన్ సమస్య, ఫోలిక్ యాసిడ్, ఐరన్ లోపంతో పాటు, విటమిన్ బీ12, విటమిన్ డి పరీక్షలు చేసి చికిత్స, మందులు అందజేస్తారు.

4, మూత్రకోశ సంబంధిత ఇన్ఫెక్షన్లు, పెల్విక్ ఇన్ఫ్లమేటరీ వ్యాధుల పరీక్షలు చేస్తారు.

5.మెనోపాజ్ దశకు సంబంధించి పరీక్షల అనంతరం అవసరమైన వారికి హార్మోన్ రీప్లేస్మెంట్ థెరపీ చేయడంతోపాటు కౌన్సిలింగ్ తో అవగాహన కలిగిస్తారు.

6, నెలసరి సమస్యలపై పరీక్షలు చేసి వైద్యం అందిస్తారు. సంతాన సమస్యలపై ప్రత్యే కంగా పరీక్షలు చేసి అవగాహన కలిగించడం, అవసరమైనవారికి అల్ట్రాసౌండ్ పరీక్షలు చేస్తారు.

7, సెక్స్ సంబంధిత అంటువ్యాధుల పరీక్షలు చేసి అవగాహన కలిగిస్తారు. అవసరమైన వారికి వైద్యం అందిస్తారు.

8, బరువు నియంత్రణ, యోగా, వ్యాయామం వంటివాటిపై అవగాహన కలిగిస్తారు.

మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం - హరీశ్ రావు

"సీఎం కేసీఆర్ ఆలోచనతో ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం "ఆరోగ్య మహిళ" అనే అద్భుతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టి, విజయవంతంగా అమలు చేస్తున్నది. ఇందులో భాగంగా ప్రతి మంగళవారం ప్రత్యేకంగా మహిళల కోసం 100 అరోగ్య కేంద్రాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నాం. మహిళల సమగ్ర అరోగ్య పరిరక్షణ కోసం, మహిళలు ప్రధానంగా ఎదుర్కునే 8 రకాల ఆరోగ్య సమస్యలను గుర్తించి వైద్యం అందిస్తున్నాం. రాష్ట్రంలో ప్రతి మహిళ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అరోగ్య మహిళ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాను"- హరీష్ రావు

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత

**కమాన్ పూర్**



కమాన్ పూర్ మండలంలో పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బి ఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.కమాన్ పూర్ మండలకేంద్రానికి చెందిన మరియు జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ముల్కలపల్లి గ్రామానికి చెందిన గుంజపడుగు గంగ, తాటిశెట్టి దేవేంద్ర, ఒడ్డెపల్లి దుర్గమ్మ లు ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొంది పెద్దపల్లి జిల్లా జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కి సిఫారసు చేసుకోగా తాటిశెట్టి దేవేంద్ర కు 32.000/- రూ, గుంజపడుగు గంగ కు 24.000/- రూ, ఒడ్డెపల్లి దుర్గమ్మకు 9.000/- రూ మంజూరయ్యాయి. మంజూరైన ముఖ్యమంత్రి సహయనిధి చెక్కులను పెద్దపల్లి జిల్లా జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు శుక్రవారం లబ్ధిదారులకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో బీఆర్ఎస్ పార్టీ కమాన్ పూర్ మండలశాఖ ఆధ్వర్యంలో చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో కమాన్ పూర్ మండల ఎంపీపీ రాచకొండ లక్ష్మీ, బీఆర్ఎస్ పార్టీ కమాన్ పూర్ మండల అధ్యక్షులు పిన్ రెడ్డి కిషన్ రెడ్డి, కమాన్ పూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, జూలపల్లి సర్పంచ్ బొల్లపల్లి శంకర్ గౌడ్, మండల కో ఆప్షన్ మెంబర్ ఎండీ. ఇంతియాజ్, జూలపల్లి ఉప సర్పంచ్ పోల్దాసరి సాయికుమార్, కమాన్ పూర్ బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నీల రాజయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాచకొండ రవి, గడప కృష్ణమూర్తి, దండే రమేష్ ఠాగూర్, పిడుగు అంజి, బంగారు గట్టయ్య, కమ్మగోని అనిల్, గోస్కి వరప్రసాద్, రాజ్ కుమార్, సాన సురేష్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షల రద్దుతో పరేషాన్ లో అభ్యర్థులు

**వరంగల్:**



టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ అంశం సంచలనం సృష్టించింది. ఫలితంగా నాలుగు పరీక్షలను రద్దు చేసింది కమిషన్. అయితే ఇందులో అత్యంత కీలమైన గ్రూప్ 1 అభ్యర్థులు కూడా ఉన్నారు. ఇప్పటికే వారు ప్రిలిమ్స్ క్వాలిఫై అయి... మెయిన్స్ కోసం సన్నద్ధమవుతున్నారు. మరోవైపు ఏఈ, ఏఈఈ, డీఏవో పరీక్షలు రాసిన వారు... తుది ఫలితాల కోసం ఎదురుచూస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పేపర్ లీక్ అంశం తెరపైకి రావటంతో.... వీరంతా మళ్లీ పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆయా అభ్యర్థులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.తెలంగాణలో వరుస ఉద్యోగ నోటిఫికేషన్లు వచ్చిన సంగతి తెలిసిందే. ఆయా నోటిఫికేషన్ల పరీక్ష తేదీలను దృష్టిలో ఉంచుకొని చాలా మంది ప్రిపేర్ అవుతున్నారు. వీరికాకుండే... చాలా ఏళ్లుగా సన్నద్ధమవుతున్న వారు కూడా ఎక్కువే ఉన్నారు. ఇందులో గ్రూప్ 1 కోసం ప్రిపేర్ అవుతున్న వాళ్లు ఎక్కువగా ఉన్నారు. అయితే ఇప్పటికే ఆయా నోటిఫికేషన్లకు అనుగుణంగా నాలుగు పరీక్షలను నిర్వహించింది టీఎస్పీఎస్సీ. ఇందులో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పూర్తి అవ్వగా.. 25 వేల మందికి పైగా అభ్యర్థులు మెయిన్స్ ప్రిపరేషన్ లో ఉన్నారు. మరోవైపు మిగతా మూడు పరీక్షల వాళ్లు... తుది ఫలితాలు విడుదలైతే ప్రక్రియ ముగిసిపోతుంది. సీన్ కట్ చేస్తే... ఒక్కసారిగా ఏఈ పరీక్ష పేపర్ లీక్ అయినట్లు బయటికి రావటం సంచలనంగా మారింది. సిట్ విచారణలో మిగతా పేపర్లు కూడా లీక్ అయినట్లు గుర్తించటంతో... నిర్వహించిన పరీక్షలను రద్దు చేయాల్సి వచ్చింది. అయితే తుది అంకానికి చేరిన సమయంలో పరీక్షలను రద్దు చేయటంతో.... సీరియస్ గా ప్రిపేర్ అయిన వారికి షాక్ ఇచ్చినట్లు అయింది. ఇనాళ్ల ప్రిపరేషన్ ఆవిరైపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితాల్లో తమ పేరు ఉంటుందన్న ఆశతో ఉన్నవారు... తీవ్రంగా మదనపడుతున్నారు. మళ్లీ ప్రిపరేషానా..? అన్న బాధను వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ నిర్వహించే పరీక్షలో ఎలా రాణిస్తామో అన్న భయం కూడా వారిలో మొదలైంది. ఇక గ్రూప్ 1 మెయిన్స్ కి సన్నద్ధమవుతున్న వారు.. చాలా టెన్షన్ అవుతున్నారు. మళ్లీ ప్రిలిమ్స్ రాయాల్సి వస్తోందని.. ఒకవేళ ఇందులో క్వాలిఫై కాకపోతే...తమ పరిస్థితేంటన్న ప్రశ్నలు కూడా వారి మెదళ్లను తొలిచివేస్తున్నాయి. ఇదిలా ఉంటే అర్థిక భారం కూడా ఉద్యోగ అభ్యర్థులను వెంటాడుతోంది. ఇన్నాళ్లుగా హాస్టళ్లో ఉంటూ ప్రిపేర్ అయ్యామని... ఆ ఖర్చులన్నీ వృథా అయిపోయాయన్న అభిప్రాయాన్ని కూడా పలువురు అభ్యర్థులు వ్యక్తం చేస్తున్నారు. ఇక ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్న కొందరు... ప్రిపరేషన్ కోసం లాంగ్ లీవ్ లు పెట్టారు. అయితే తీరా గ్రూప్ 1 మెయిన్స్ ప్రక్రియ కూడా మరో మూడు నెలల్లో ముగియనుంది. కానీ ఇప్పుడు పరీక్ష రద్దుతో విషయం కాస్త... మళ్లీ మొదటికివచ్చింది. అయితే సదరు ఉద్యోగాలు... ఇప్పుడే ఏం చేయాలన్న సందిగ్ధంలో ఉన్నారు. లీవ్ పొడిగింపు సాధ్యం కాకపోతే...వదిలేసే పరిస్థితి వస్తోందని చెబుతున్నారు.గ్రూప్ 1 కోసం ప్రిపేర్ అవుతున్న శ్రీనివాస్ అనే అభ్యర్థితో హిందూస్థాన్ టైమ్స్ తెలుగు మాట్లాడింది." నేను ఓ ప్రైవేట్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్నాను. గ్రూప్ 1 దృష్ట్యా కొంత కాలం పాటు సమయం తీసుకున్నాను. ప్రిలిమ్స్ క్వాలిఫై అయ్యాను. మెయిన్స్ కూడా ప్రిపేర్ అవుతున్నాను. కానీ ఇప్పుడు ప్రిలిమ్స్ పరీక్ష రద్దుతో ఏం చేయాలో అర్థం కావటం లేదు. పూర్తిగా ఉద్యోగానికి రిజైన్ చేయటమా..? లేక మళ్లీ ప్రిపరేషన్ మొదలుపెట్టలా అనే విషయంపై ఆలోచించాల్సి వస్తోంది" అని చెప్పారు.మరోవైపు ప్రభుత్వం... పలు సదుపాయాలను కల్పిస్తామని ప్రకటించింది. ఉచిత మెటీరియల్, కోచింగ్, భోజనం వంటివి ఏర్పాటు చేస్తామని తెలిపింది. అయితే సదుపాయాలు కాదు... తమకు సమయం చాలా ముఖ్యమని, పరీక్షల రద్దుతో అలాంటి టైం వృథా అయిపోందని పలువురు అభ్యర్థులు చెబుతున్నారు.

# జనగామలో హాత్ సే హాత్ జోడో

**జనగామ**

ప్రజా సంక్షేమం కోసమే రాహుల్ గాంధీ హాత్ సే హాత్ జోడోయాత్ర చేపట్టారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి హాత్ సే హాత్ జోడో యాత్ర కార్యక్రమం చేపట్టారు. పట్టణంలోని అంబేద్కర్ నగర్,సంజయ్ నగర్, ధర్మకంచ, గుండ్లగడ్డ ప్రాంతాలలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పార్టీ కరపత్రాలను అందజేసి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు.ఈ సంధర్బంగా కొమ్మూరి మాట్లాడుతూ జనగామ ఎమ్మెల్యే భూ కబ్జాలు తప్ప నియోజక వర్గ అభివృద్ధి చేయడంలేదని విమర్షించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జనగామకు మంచినీటిని ఉచితంగా అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చాడు

ప్రజా తపన
prajathapana.com
News that matters

## బస్సును ఢీకొన్న లారీ క్లీనర్ మృతి..డ్రైవర్ కు గాయాలు

**నల్గోండ**

హైద్రాబాద్ – విజయవాడ నేషనల్ హైవేపై రోడ్డుప్రమాదం జరిగింది. చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం వద్ద ముందు వెళుతున్న బస్సును ఒక లారీ వెనకనుంచి ఢీకొంది. ప్రమాద ధాటికి లారీ క్యాబిన్ నుజ్జు నుజ్జయింది. లారీ డ్రైవర్, క్లీనర్ క్యాబిన్ లో ఇరుక్కుపోయారు. పోలీసులు, స్థానికులు సుమారు రెండు గంటల పాటు శ్రమించి వారిద్దరిని బయటికి తీసి ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలో క్లీనర్ మృతి చెందాడు. ప్రమాదంలో బస్సులో ఉన్న ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

## ఇంటి బయట పడుకున్న వ్యక్తి దారుణ హత్య

**సిద్ధిపేట**

సిద్ధిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామలో ఓ వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు నరికి చంపిన ఘటన చోటు చేసుకుంది. గజ్వేల్ మండలం జాలిగామ గ్రామానికి చెందిన కామల్ల సత్తయ్య (45)గురువారం రాత్రి సమయంలో తన ఇంటి ముందు నిద్రిస్తున్నాడు. అదే సమయంలో గుర్తు తెలియని దుండగులు సత్తయ్యను బలంగా తలపై కొట్టి హత్య చేశారు. తెల్లవారేసరికి రక్తపు మడుగులో ఉన్న సత్తయ్యను చూసి కుటుంబ సభ్యులు ,గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## చేపల చెరువులో రాకాసి చేపల కలకలం

**నల్గోండ**



నల్గొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి చెరువులో రాకాసి చేపలు కలకలం సృష్టించాయి. గురువారం సాయంత్రం మత్స్యకారుల వలలో రాకాసి చేపలు చిక్కడంతో వారు ఆశ్చర్యపోయారు. రాకాసి చేపల దెబ్బకు చెరువులో చేపలు లూటీ అయ్యాయని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు. రాకాసి చేపలు చెరువులో వున్న చేపలను మొత్తం తినేసాయి. దాంతో మత్స్యకారులకు భారీ నష్టాన్ని మిగిలించాయి.

## అరెస్టులతో ఉద్యమాన్నిఆపలేరు

**హైదరాబాద్**

ఓయూలో శుక్రవారం ఉదయం నిరుద్యోగ మార్చ్, మధ్యాహ్నం నిరసన దీక్ష కార్యక్రమాల సందర్భంగా ఓయూలో విద్యార్థి నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ లుచేసారు. ఉదయాన్నే వివిధ వసతి గృహల్లో పోలీసులు దాడులు జరిపి పలుమందిని అదుపులోకి తీసుకున్నారు.
ఓయూ జేఏసీ నేత శరత్ నాయక్ మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు. 30 లక్షల పైగా విద్యార్థి నిరుద్యోగులు ఆవేదన పడుతుంటే ఇప్పటివరకు రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించకపోవడం బాధాకరం. టీఎస్పీఎస్సీ పరీక్ష పత్రాలు లీకేజ్ కి మూలకారకులైన చైర్మన్ సభ్యులను వెంటనే తొలగించాలి మొత్తం వ్యవహారంపై సిబిఐ లేదా సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలి, ఉద్యోగ కాలండర్ ప్రకటించాలి, రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి నిరుద్యోగికి రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల బృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులంతా స్వచ్ఛందంగా తరలివచ్చి ఉస్మానియా యూనివర్సిటీకి చేరుకోవాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు.

## గ్యాస్ ట్యాంకర్ కు ప్రమాదం-డ్రైవర్ కు గాయాలు

**విశాఖపట్నం**

విశాఖపట్నం జిల్లా కంచరపాలెం నేషనల్ హైవే లో శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. మూడు గంటల ప్రాంతంలో ముందు వెళుతున్న టాటా ఏసీ మినీ వ్యాన్ సడన్ గా ఆగిపోయింది. దాంతో వెనుక వస్తున్న ఇండియన్ ఆయిల్ ట్యాంకర్ ఢీకొంది. తరువాత డివైడర్ ను తాకి పక్కన వున్న చెట్లలోకి దూసుకు వెళ్లింది. ఘటనలో ట్యాంకర్ డ్రైవర్ కు గాయాలు అయ్యాయి. ఇండియన్ ఆయిల్ కి సంబంధించిన గ్యాస్ ఫుల్ ట్యాంక్ లో ఉండడంతో హెచ్పీసీఎల్ సిబ్బంది హుటా హుటిన అక్కడికి చేరుకున్నారు. గ్యాస్ లీక్ అవకుండా జాగ్రత్తలు తీసుకొని లారీని సురక్షితంగా తరలించారు.

## అసంతృప్తితో క్రాస్ ఓటింగ్

**గన్నవరం**

మా ఎక్స్ బాస్ చంద్రబాబు నాయుడు మైండ్ గేమ్ ఆడటం లో దిట్టా అని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ వ్యాఖ్యానించారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి సూటిగా ఎమ్మెల్యేలను ప్రశ్నించడంలో అసంతృప్తితో ఉన్న నలుగురు ఎమ్మెల్యేలు క్రాస్ ఓటు వేశారు. ఒక ఎమ్మెల్యే బాలకృష్ణ సినిమాలకు వరకే పరిమితం రాజకీయాలు వేరు సినిమా వేషాలు వేరు. ఆ నలుగురు ఎమ్మెల్యేలు డబ్బులు దండుకున్నారు ఎక్స్ బాస్ కి పదవి వచ్చిందని అయన అన్నారు..

# కమలం ఒంటరి పోరుకు సంకేతాలు

**కాకినాడ :**

ఆంధ్రప్రదేశ్ బీజేపీ ఒంటరిగానే వెళ్లేందుకు దాదాపు సిద్ధమయింది. పార్టీ కేంద్ర నాయకత్వం నుంచి కూడా అదేరకమైన సంకేతాలు అందుతున్నాయి. జనసేన అధినేత పవన్ కల్యాణ్ తో సంబంధం లేకుండా పార్టీ కార్యక్రమాలు చూసుకోవాలని స్పష్టమైన మెసేజ్ హస్తిన నుంచి బెజవాడకు చేరినట్లు విశ్వసనీయ సమాచారం. జాతీయ పార్టీ ఒకరి కోసం వెంపర్లాడే పరిస్థితి లేదన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ఇటీవల మచిలీపట్నంలో జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ సభలో పవన్ చేసిన ప్రసంగాల క్లిప్పింగ్ లను కూడా కేంద్ర నాయకత్వానికి పంపారు. దీంతో ఒకరితో పనిలేకుండా పార్టీ విజయం కోసం పని చేయాలని సూచించినట్లు రాష్ట్ర ముఖ్య నేతలకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. తనకు కేంద్ర నాయకులతో ఎలాంటి ఇబ్బందులు లేవని, రాష్ట్ర నేతలతో సమస్య అని పవన్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. చలో అమరావతి కార్యక్రమాన్ని ఇక్కడ వాయిదా వేయించింది కూడా ఇక్కడి నేతలే అన్నారు. తెలంగాణలో కలసి పోటీ చేయాలనుకున్నా ఆంధ్రోడివని కొందరు అంగీకరించలేదన్నారు. ఈ వ్యాఖ్యలను కేంద్ర నాయకత్వం కూడా సీరియస్ గా తీసుకున్నట్లుంది. పవన్ కల్యాణ్ తొలి నుంచి టీడీపీ, బీజేపీతో కలసి పోటీ చేయాలని భావిస్తున్నారు. ఆ దిశగా ఆయన ప్రయత్నాలు చేశాడు. కానీ బీజేపీతో కలసి పోటీ చేస్తే 2019 ఎన్నికల ఫలితాలు రిపీట్ అవుతాయని భావించి పవన్ వెనకడుగు వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పవన్ టీడీపీతో వెళ్లేందుకే నిర్ణయించుకున్నట్లు స్పష్టంగా అర్థమవుతుందని రాష్ట్ర నేతలు కేంద్ర నాయకత్వానికి వివరించినట్లు తెలిసింది. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ పవన్ మద్దతును బీజేపీ నేతలు కోరినా అందుకు ఆయన సహకరించలేదు. ఈ ఎన్నికలు కాదు బద్వేలు, ఆత్మకూరు ఉప ఎన్నికల్లోనూ ఆయన తమకు సహకరించలేదన్నది బీజేపీ నేతల వాదన. కేవలం రాష్ట్ర ఎన్నికల సమయంలో కేంద్ర నాయకత్వం అండ కోసమే బీజేపీ మద్దతు కోరుకుంటున్నారని కూడా రాష్ట్ర నాయకత్వం అభిప్రాయపడుతుంది. అందుకే కేంద్ర నాయకత్వం కూడా పవన్ పట్టించుకోకుండా ఎవరి పని వారు చేసుకోవాలని సూచించినట్లు తెలిసింది. ఒకరి బ్లాక్ మెయిల్ కు, ఒకరి వ్యూహాలతో మనం భయపడాల్సిన పనిలేదని, సొంతంగా ఎదిగేందుకే ప్రయత్నాలు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి సూచించినట్లు తెలిసింది. ఇప్పుడు కాకపోతే.. మరొకసారి ఎప్పటికైనా ఏపీలో బీజేపీ జెండా ఎగురవేయగలమని, పొత్తుల గురించి ఆలోచించవద్దని సూచించినట్లు తెలిసింది. భీమవరంలో జరిగిన సమావేశంలోనే ఈ స్పష్టత వచ్చినా మరోసారి పొత్తులపై కూడా కేంద్ర నాయకత్వం నుంచి స్పష్టత వచ్చినట్లు తెలిసింది.తెలుగుదేశం పార్టీతో కలసి పోటీ చేసే అవకాశం లేనే లేదని కేంద్ర నాయకత్వం సుస్పష్టంగా చెప్పినట్లు సమాచారం. ఏమైనా కొద్దిగా మనసులో ఉన్నా వాటిని చెరిపేసి ముందుకు నడవండని రాష్ట్ర నాయకత్వానికి సూచించిందని చెబుతున్నారు. మూడు రోజుల క్రితం జరిగిన బీజేపీ కోర్ కమిటీ సమావేశంలో మరోసారి దీనిపై నేతలకు స్పష్టత ఇచ్చినట్లు తెలిసింది. పవన్ ఎటూ తమతో కలసి రాడని బీజేపీ నేతలకు అర్థమయి పోయింది. బతిమాలనుకుని ప్రయోజనం లేదని, ఎన్నికల సమయానికి కలసి వస్తే చూద్దామని, లేకుంటే లేదని కూడా నేతలు అభిప్రాయపడినట్లు తెలిసింది. పవన్ కల్యాణ్ పొత్తులు కాదనుకుని వెళ్లిపోయినా పెద్దగా ఇబ్బంది ఉండదని, ఒంటరిగానైనా పోరాడేందుకు సిద్ధపడాలని సెంట్రల్ నుంచి సిగ్నల్స్ వచ్చినట్లు తెలిసింది.

# నష్టాల బాటలో పౌల్ట్రీ రైతులు

**ఏలూరు :**

చికెన్ ధరలు నేలను తాకాయి. కోడి గుడ్డు ధరలూ క్రమంగా పతనమవుతున్నాయి. దీంతో, పౌల్ట్రీ రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రెండ్రోజులుగా కేజీ చికెన్ లైవ్ ధర రూ.80 నుంచి రూ.44కు పడిపోయింది. రిటైల్ మార్కెట్లో రూ.90 చొప్పున విక్రయాలు జరుగుతున్నాయి. కోడి గుడ్డు పేపరు ధర రూ.4.13 ఉండగా తొమ్మిది పైసలు కమిషన్‌పోను రైతుకు రూ.4.04 మాత్రమే దక్కుతోంది. చికెన్ లైవ్ ధర కనీసం రూ.80, కోడి గుడ్డు ధర రూ.5.50 లేనిదే గిట్టుబాటు కాదని రైతులు వాపోతున్నారుఉమ్మడి జిల్లాలో వ్యవసాయం తరువాత పెద్ద పరిశ్రమగా పౌల్ట్రీ ఉంది. సుమారు 300 పౌల్ట్రీ ఫారాలు ఉన్నాయి. దాదాపు 1.40 కోట్ల కోళ్ల పెంపకం అవుతోంది. రాష్ట్రంలో ఐదు కోట్ల వరకూ కోళ్ల ఉత్పత్తి జరుగుతోంది. దీనిలో 30 శాతం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచే ఉంది. ఈ రంగంలో ప్రత్యక్షంగా 20 వేలమంది, పరోక్షంగా మరో 20 వేల మంది మొత్తం 40 వేల మంది ఉపాధి పొందుతున్నారు. ఈ పరిశ్రమకు లారీ పరిశ్రమ అనుబంధంగా ఉపాధి పొందుతోంది. రైతుల వద్ద కోళ్లను కొనుగోలు చేసిన వారు లారీల్లో ఒడిశా, బీహార్, బెంగాల్ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటాయి. ఈ రాష్ట్రాలకే ఆంధ్ర నుంచి అత్యధికంగా కోళ్లు ఎగమతి అవుతుంటాయి. ప్రస్తుతం ఆయా రాష్ట్రాల్లో పౌల్ట్రీకి ప్రభుత్వాలు ప్రోత్సాహం ఇస్తున్నాయి. ఫలితంగా ఒడిశా, బీహార్, బెంగాల్ రాష్ట్రాల్లో పౌల్ట్రీ ఉత్పత్తి ఘననీయంగా పెరిగింది. ఈ ప్రభావం జిల్లాలోని పౌల్ట్రీ పరిశ్రమపై పడింది. ఇక్కడి నుంచి ఎగుమతులు తగ్గిపోయాయి. ఉత్పత్తికి తగినట్లుగా ఎగుమతులు లేకపోవడంతో ధరల పతనమయ్యాయి. వారం రోజుల వరకూ కెజీ చికెన్ ధర (స్కిన్ లెస్) రూ.220 ఉండేది. ప్రస్తుతం రూ.140 ఉంది.కోళ్ల పెంపకానికి మొక్కజొన్న, సోయా దాణాను అధికంగా వాడుతుంటారు. మొక్కజొన్న దాణా టన్నుకు ఏడాదిలో రూ.18 వేల నుంచి రూ.25 వేలు, సోయా రూ.50వేల నుంచి రూ.80 వేలకు పెరిగింది. లేబర్ ఛార్జీ, మెడిసిన్ ఖర్చు, కరెంట్ ఛార్జీలు అదనం. కిలో లైవ్‌కు రూ.80 లేనిదే కనీసం గిట్టుబాటు కాదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం లైవ్ కిలో రూ.44 మించకపోవటంతో పెట్టుబడి ఖర్చులు కూడా రావట్లేదని వాపోతున్నారు. ఫారంలో పది వేల కోళ్లను పెంచడానికి రూ.15.50 లక్షల వరకూ ఖర్చు పెట్టాల్సి వస్తోందని, ప్రస్తుతం ధర ప్రకారం రూ.4 నుంచి రూ.6 లక్షలు కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు చెప్తున్నారు. పది వేళ్ల కోళ్లను పెంచే ఫారం యజమానికి రూ.5 లక్షలకు పైబడి నష్టం వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఎన్నికల వేళ డైవర్షన్ స్కెచ్

**హైదరాబాద్ :**

నీళ్లు, నిధులు, నియామకాలు ట్యాగ్ లైన్‌తో తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఉవ్వెత్తున్న ఎగిసింది. ఆ సమయంలో అప్పటి టీఆర్ఎస్(బీఆర్ఎస్) పార్టీ ఈ నినాదాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో సక్సెస్ అవ్వడం దరిమిలా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించడంతో పాటు ఉద్యమ పార్టీ అధికారం చేజిక్కించుకుంది. ఆ పార్టీపై అన్ని వర్గాల్లో ఆనాడు నమ్మకం కుదిరింది. యువత సైతం తెలంగాణ ఉద్యమాన్ని భూజానికెత్తుకున్ని తమకు ఉద్యోగాలు వస్తాయని పోరాటం సాగించారు. కానీ తొలి దఫా ప్రభుత్వంలో బీఆర్ఎస్ పార్టీ నిరుద్యోగులకు షాక్ ఇచ్చింది. నియామకాల్లో తీవ్ర జాప్యం కారణంగా యువకుల్లో ఉన్న వ్యతిరేకతను పసిగట్టిన సీఎం కేసీఆర్ రెండోసారి అధికారంలోకి రావడానికి సాధ్యసాధ్యాలను పక్కనబెట్టి నిరుద్యోగ భృతి రూ.3016 ఇస్తామనే హామీని తెరపైకి తీసుకొచ్చారు. దీంతో యువకులు పెద్ద ఎత్తున ఈ స్కీంకు అప్లై చేసుకున్నారు. తెలంగాణ ఎంప్లాయిస్ ఎక్ఛ్సేంజీలో మొత్తం 10లక్షల మంది, టీఎస్పీఎస్సీలో 30 లక్షల మంది వరకు ఉద్యోగాలకు అప్లై చేసుకున్నారంటే తెలంగాణలో నిరుద్యోగం ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. వీరు మాత్రమే కాకుండా చాలా మంది వయసు దాటి పోవడంతో ఉద్యోగాల ఆశ వదులుకున్నారు.ప్రైవేట్ జాబ్‌లు, బిజినెస్‌లు, గల్ఫ్ బాట పట్టారు. ఇక తాజా బడ్జెట్‌లో సైతం ఆర్థిక మాంద్యం సాకుగా ఈ పథకానికి ప్రభుత్వం మంగళం పాడింది. అయితే నిరుద్యోగ భృతి స్థానంలో ఉద్యోగాల భర్తీ అంశాన్ని బీఆర్ఎస్ తెరపైకి తెచ్చి ఎన్నికల వేళ యువతను డైవర్ట్ చేసే స్కెచ్ వేసింది. నిరుద్యోగ యువత పరీక్షలపై ఫోకస్ పెట్టాలని.. తద్వారా ఎలక్షన్స్‌లో తమకు ఎలాంటి ముప్పు వాటిల్లకూడదని బీఆర్ఎస్ భావించింది.అయితే తాజాగా యాఖూఅ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం తెరపైకి రావడంతో నిరుద్యోగ యువతలో ఆగ్రహం కట్టలు తెంచుకుంటుంది. ఆరు నెలల్లో ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నందున రిక్రూట్‌మెంట్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. నిరుద్యోగులంతా పరీక్షలకు సన్నద్ధమైతే తమకు ఎలాంటి నష్టం వాటిల్లదని భావించిన గులాబీ బాస్‌కు యాఖూఅ వ్యవహారం కొత్త తలనొప్పిగా మారింది. గతేడాది అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ 91,142 ఉద్యోగాలను నోటిపై చేసిన్నట్లు వాటి నియామకానికి ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రకటించారు. సీఎం ప్రకటన జారీతో అధికారులు హుటాహుటిన ఆయా శాఖల వారీగా ఖాళీల జాబితాను ప్రకటించాయి. అయితే నిరుద్యోగుల్లో రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఉన్న వ్యతిరేకతను గ్రహించే కేసీఆర్ ప్రకటన చేశారని ప్రతిపక్షాలు ఆ సందర్భంగా ఆరోపించాయి. ఎన్నికల స్టంట్ మాత్రమే అని ప్రతిపక్షాలు ఫైర్ అయ్యాయి. అయితే తాజా టీఎస్పీఎస్సీ వివాదంతో నియామక ప్రక్రియకు బ్రేక్ పడటంతో బీఆర్ఎస్ పార్టీలో టెన్షన్ మొదలైంది. ఎన్నికల వేళ లీకేజీ వ్యవహారం ఫలితాలపై ఎఫెక్ట్ చూపుతుందని భావించిన కేసీఆర్ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. అటు లిక్కర్ స్కాంలో కవిత పేరు వినిపించడం, టీఎస్పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంతో సొంత పార్టీ నేతల్లో గుబులు మొదలైంది.ఇద్దరు వ్యక్తుల తప్పుగా ఇటీవల టీఎస్పీఎస్సీ అంశాన్ని మంత్రి కేటీఆర్ ముడిపెట్టారు. ప్రభుత్వ పనితీరుపై మాత్రం సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇద్దరు వ్యక్తులు లీకేజీకి పాల్పడేంత వీక్‌గా మన సిస్టం ఉందా అని నెటిజన్లు సోషల్ మీడియాలో ప్రభుత్వంపై ప్రశ్నలు సంధిస్తున్నారు. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే ఏ అంశంపైన అయినా విలేకరుల సమావేశం పెట్టి గంటల తరబడి ఎండగట్టే కేసీఆర్ ఈ అంశంపై స్పందికపోవడం ఏంటనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.నిరుద్యోగులు వారిపై ఆధారపడిన కుటుంబాల్లో భరోసా కల్పించాల్సిన బాధ్యత ఉన్న సీఎం కేసీఆర్ ఇప్పటి వరకు ప్రెస్ మీట్ పెట్టకపోవడం కొసమెరుపు. అయితే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే అంశం కావడంతో సీఎం ఈ అంశంపై సమీక్ష నిర్వహించారే తప్ప ఎలాంటి కామెంట్ చేయలేదని టాక్ నడుస్తోంది.

## చట్టసభలో బీసీలకు యాబై శాతం రిజర్వేషన్ కల్పించాలి బీసీ సంఘం డిమాండ్

**విశాఖపట్నం**

చట్టసభలో బీసీలకు యాబై శాతం రిజర్వేష న్ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం స్టేట్ కన్వినర్ బోను దుర్గా నరేష్ యాదవ్ డిమాండ్ చేశారు. హలో బీసీ ....చలో రాజమండ్రి....అనే నినాదంతో బీసీ గర్జన సభ ఈ నెల 25 న నిర్వహిస్తున్నట్లు తెలి పారు. పార్లమెంట్లో బీసీ బిల్లు ప్రవేశ పెట్టాలని,యాబై శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆయన డిమాండ్ చేశా రు. జనగణనలో కులగణన జరగాలని అప్పుడే దేశంలో బీసీ ల సంఖ్యాబలం స్రష్టం అవుతుందని అన్నారు. కేంద్రం లో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్లో బీసీ మహిళ బిల్లు ప్రవేశ పెట్టాలని ఆయన కోరారు. ఉద్యోగస్తు లకు ప్రమోషన్లు రిజర్వేషన్లు కల్పించా లని విజ్ఞప్తి చేశారు. హలో బిసి చలో రాజమండ్రి కార్యక్రమంలో బీసీ సోదర సోదరీమ ణులు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయ వంతం చేయాలని బిసిలకు పిలుపునిచ్చారు

## మాకు 23 కలిసోచ్చింది -మాజీ మంత్రి గంటా

**విశాఖపట్నం**

దేవుడు చక్కగా స్క్రిప్ట్ ఇచ్చాడుని,23 సంఖ్య తమకు కలిసివచ్చేటట్లు చేశా డని మాజీ మంత్రి, విశాఖ ఉత్తర ఎమ్మె ల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు.ఏ డు ఎమ్మెల్సీ లో ఒకటి టీడీపీ అనూ హ్యంగా గెలవడం ఆ గెలుపులో వైసీపీ కి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు సహక రించడంతో టీడీపీకి ఆదరణ చెక్కు చెదరలేదన్నది స్పష్టమవుతుం దన్నా రు.హిందూపురం నుంచి ఇచ్చాపురం వరకూ ఒకటే గాలి వీచిందన్నారు. ఎమ్మెల్సీ గెలవడంతో విశాఖ టీడీపీ కార్యాలయంలో గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించా రు.ఈ సందర్భంగా గంటా మాట్లాడు తూ ఎమ్మెల్సీ ఎన్నికలు సెమీఫైనల్స్ అని వైసిపి వారే అన్నా రని, సెమీస్ లో ఓడిపోతే ఇక ఫైన ల్స్ లో స్థానం ఉండ దన్న విషయం ఇప్పటికైనా తెలు సుకో వాలన్నారు. వైసిపి కి ఇది తీవ్రమైన ప్రతికూల ఫలితాల న్నారు. జగన్కి ఇచ్చిన ఒక్క ఛాన్స్ అయ్యి పోయింద ని స్పష్టమైన తీర్పుకు ఇది సంకేతమ న్నారు.సీనియర్ మిని స్టర్లను ఉపయో గించి మాక్ పోలింగ్ నిర్వహించినా ఫలితం లేకపోయింద న్నారు..

## అప్పన్న సన్నిధిలో ఘనంగా స్వర్ణపుష్పార్చన

**విశాఖపట్నం**

విశాఖ వరాహలక్ష్మీనృసింహ స్వామి వారి దేవస్థానం సింహాచలం స్వామి వారికి 108 బంగారు సంపెంగలతో స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహిం చారు.సింహాచల పుణ్య క్షేత్రములో దేవస్థాన వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా పలు ఆర్జిత సేవలు వైభ వంగా నిర్వహించారు. అర్చకులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుం దరంగా అలంకరించి ఆలయ కల్యాణ మండపములో వేదికపై అధిష్టింప జేసి వేద మంత్రాలు నాథ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి స్వర్ణపుష్పార్చన,సేవ వైభవంగా నిర్వ హించారు.భక్తులు శ్రీ స్వామి వారి ఆర్జిత సేవలలో పాల్గొని తరించారు

## ఆత్మరక్షణకు కరాటే దోహదం...హీరో సుమన్

**విశాఖపట్నం**

ప్రాచీన యుద్ధ కళల పట్ల ప్రతిఒక్కరిలో ఆసక్తి నింపాల ని సినీనటుడు సుమన్ తల్వార్ అన్నారు.క్రీడల్లో భాగ మైన కరాటే కు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు.విశా ఖలో 8 వ జిల్లా స్థాయి వాడొకయి కరాటే పోటీల బెల్ట్ టెస్ట్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నా రు.ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని అన్నా రు.చిన్న వయసులోనే విద్యార్థులకు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించేలా పాఠశాలల యాజమాన్యా లు కృషి చేయాలని కోరారు..

## సీపీఐ పై ఫేస్ బుక్ లో తప్పుడు ప్రచారం - పోలీసులకు సిపిఐ పిర్యాదు

**విశాఖపట్నం**



ధర్మ ధ్వజం హిందూ చైతన్య వేదిక అనే పేరుతో నిర్వహిస్తున్న పేస్ బుక్ పేజీలో సిపిఐపై తీవ్రమైన అసత్య ప్రచారం జరుగుతోంది.నాలుగు రోజు లు క్రితం ఆ పేస్ బుక్ ఖాతాలో సిపిఐ ప్రపంచ ఉగ్రవాద సంస్థల జాబితాలో ఉన్న రాజకీయ పార్టీ అని పేర్కొంటూ ప్రచారం చేశారు.ఇందుకు ఇన్స్టిట్యూ ట్ ఫర్ ఎకనామిక్స్ అండ్ పీస్ సంస్థ విడుదల చేసిన గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ 2023 నివేదికను అదారంగా చూపారు.ఐతే, 95 పేజీలతో ఉన్న ఆ నివేదిక ఒరిజినల్ కాఫీలో 14 వ పేజీ లోని లిస్టులో సిపిఐ అనే పేరు ఎక్కడా లేదు.ఘన చరిత్ర కలిగిన బాధ్యతా యుత రాజకీయ పార్టీపై ఉద్దేశ పూర్వ కముగా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన ఆ పేస్ బుక్ పేజీ నిర్వా హకులపై కఠిన చర్యలు తీసుకోవాలని విశాఖ నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో పిర్యాదు చేశారు.

# మూడో ఫ్రంట్ కడుతున్న మమత

**భువనేశ్వర్ :**

పశ్చిమ బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమత బెనర్జీ బీజేపీయేతర, కాంగ్రెసేతర కూటమి కోసం చాన్నాళ్లుగా ప్రయత్నిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమబెంగాల్ లో గట్టి పోటీ ఇచ్చిన బీజేపీ ని ఓడించారు. దేశ వ్యాప్తంగా బీజేపీని ఓడించడం లక్ష్యంగా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. ముఖ్యంగా, పలు రాష్ట్రాల్లో బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీలతో కలిసి ఒక బలమైన మూడో కూటమి ఏర్పాటుకు కృషి చేస్తున్నారు. ఒడిశాలో బలంగా ఉన్న, 21 లోక్ సభ స్థానాల్లో కనీసం 20 సీట్లు గెలుచుకోగల బీజేడీ ని తమ కూటమిలో చేర్చుకోవడం కోసం మమత ప్రయత్నిస్తున్నారు. మరోవైపు, తెలంగాణ సీఎం, భారత రాష్ట్రీయ సమితి అధ్యక్షుడు కే చంద్ర శేఖర్ రావు కూడా రానున్న లోక్ సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బీఆర్ఎస్ (ఃఖీూ) కేంద్రంగా మూడో కూటమి కోసం ప్రయత్నిస్తున్నారు .పశ్చిమ బెంగాల్ సీఎం మమత బెనర్జీ ఒడిశాలో పర్యటిస్తున్నారు. ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ ఆహ్వానంపై ఆమె ఆ రాష్ట్రంలో మూడు రోజుల పర్యటన ప్రారంభించారు. లోక్ సభ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో ఈ రెండు బీజేపీయేతర ముఖ్యమంత్రులు భేటీ కావడంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.మమత బెనర్జీ ఇటీవల ఉత్తర ప్రదేశ్ లోనూ పర్యటించారు. అక్కడ సమాజ్ వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమత బెనర్జీ, సమాజ్ వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ లు సంయుక్తంగా ఒక ప్రకటన చేశారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ కు సమాన దూరం పాటిస్తామని వారు స్పష్టం చేశారు. దాంతో, ఇప్పుడు ఒడిశా పర్యటనలోనూ మమత బెనర్జీ బిజూజనతాదళ్ చీఫ్, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కూడా అదే తరహాలో ఒక సంయుక్త ప్రకటన చేసే అవకాశముందని భావిస్తున్నారు. అయితే, మూడో ఫ్రంట్ ఏర్పాటు విషయమై ఇంతవరకు ఎవరితో చర్చించలేదని నవీన్ పట్నాయక్ ప్రకటించారు. 2009లో బిజూ జనతాదళ్ బీజేపీ తో పొత్తు తెంచుకుని ఎన్డీఏకు దూరమైంది. అప్పటి నుంచి ఆ పార్టీ బీజేపీకి, కాంగ్రెస్ కు సమదూరం పాటిస్తోంది. అయినా, కేంద్రంలోని బీజేపీ విధానాలకు మద్దతిస్తూ వస్తోంది.

# చక్రం తిప్పుతున్న పీఆర్వోలు

**హైదరాబాద్:**

మంత్రుల దగ్గర పనిచేస్తున్న పీఏ, పీఆర్వోలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రతి నెలా ఆఫీసు నిర్వహణ కోసం, మంత్రులు జిల్లా టూర్లకు వెళ్లినప్పుడు అధికారులు, కాంట్రాక్టర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ప్రతి నెలా ఫస్ట్ వీక్‌లో పెట్టిన టార్గెట్ మేరకు డబ్బులు వసూలు చేసే బాధ్యత మినిస్టర్ పేషీల్లోని స్టాఫ్ చూసుకుంటున్నట్టు సమాచారం.సీఎం చీఫ్ పీఆర్వోపై పెద్ద ఎత్తున విమర్శలున్నాయి. ఆయన ఎక్కడి నుంచి డ్యూటీ చేస్తారు? ఏం సమాచారం ఇస్తారు? అనేది సీఎంవో వర్గాల్లోనే చర్చ జరుగుతున్నది. సీఎంవోలోని మిగతా పీఆర్వోలు కూడా సరిగా పని చేయడం లేదనే అభిప్రాయం ప్రగతిభవన్‌లో ఉన్నది.ఏయే మినిస్టర్ పేషీ స్టాఫ్ ఎంత వసూలు చేస్తున్నారు? ఎవరి వద్ద నుంచి తీసుకుంటున్నారు? అనే పూర్తి డేటా నిఘా వర్గాల వద్ద ఉన్నట్టు తెలిసింది. ఈ మధ్య ఉత్తర తెలంగాణలోని ఓ మంత్రి పీఏ ఆ జిల్లాకు చెందిన ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంట్ అధికారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేసినట్టు తెలిసింది. ప్రతి నెలా మామూళ్లు ఇవ్వాలని, ఏ చెక్ పోస్టు నుంచి ఎంత ఇవ్వాలో ఆయన డిసైడ్ చేస్తారనే చర్చ ఆ శాఖలో ఉన్నది. ఈ విషయాలన్నీ సదరు మంత్రికి తెలిసే జరుగుతాయని ఆ జిల్లా లీడర్లు చెబుతున్నారు.ఫస్ట్ టర్మ్ గవర్నమెంట్‌లో పలువురు మంత్రుల పీఏ, పీఎస్, పీఆర్వోలపై విమర్శలు వచ్చాయి. కొందరు మంత్రుల వద్ద పని చేసే పీఏ, పీఎస్, ఓఎస్డీలు సెటిల్‌మెంట్లు చేస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. గ్రేటర్ పరిధిలోని ఓ మంత్రి వద్ద పని చేసే పీఏ ఆ నియోజకవర్గంలో సెటిల్‌మెంట్లు చేస్తారని ప్రచారం సాగుతున్నది. ఇందు కోసం ఆ పీఏ మంత్రికి చెందిన చాంబర్‌నే అడ్డాగా మార్చుకున్నట్టు చర్చ జరుగుతున్నది. దీని వెనుక సదరు మంత్రి ప్రోత్సాహం కూడా ఉన్నదని, అందుకే ఆ పీఏ ధైర్యంగా దందాలు చేస్తున్నట్టు పార్టీ లీడర్లే మాట్లాడుకుంటున్నారు. ఓ మంత్రి వద్ద పనిచేసే ఓఎస్డీ ఆ శాఖకు చెందిన పెండింగ్ బిల్లులను సాంక్షన్ చేయించేందుకు కమిషన్లు తీసుకుంటారని ప్రచారం ఉన్నది.సీఎం పీఏగా అజిత్ రెడ్డిని ఉన్న పళంగా పక్కన పెట్టేశారు. ఎందుకు ఆయన్ను పక్కన పెట్టారో ఎవరికీ తెలియదు. గతంలో సీఎం పీఆర్వోగా పని చేసిన గటిక విజయ్ కుమార్ సడెన్‌గా రిజైన్ చేశారు. ఆయన రాజీనామా వెనుక ఏం కారణం ఉన్నదో ఇప్పటికీ తెలియని విషయం. ప్రస్తుత హోంమంత్రి మహమూద్ అలీ ఫస్ట్ టర్మ్‌లో రెవెన్యూ శాఖ బాధ్యతలు చూశారు. అప్పట్లో మియాపూర్ భూ కుంభకోణంలో ఆయన పీఎస్ పాత్ర ఉన్నదనే ఆరోపణలు వచ్చాయి. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేషీలో పని చేస్తున్న హరీశ్, అశోక్‌ను క్యాసినో కేసులో ఈడీ విచారించింది.ఈ మధ్య వివాదాల్లో చిక్కుకున్న ఓ మంత్రి పీఏ పేరు చెబితే మిగతా మంత్రులు, ఎమ్మెల్యేలే భయపడుతున్నారు. ఆ కీలక మంత్రి షెడ్యూల్ కనుక్కునేందుకు ఆయన పీఏకు ఫోన్ చేస్తే చిరాకుగా సమాధానం ఇస్తున్నారనే టాక్ ఉన్నది. కొన్ని సార్లు మిగతా మంత్రుల ఫోన్ కాల్స్‌నూ ఆయన రిసీవ్ చేసుకోరని విమర్శలున్నాయి. ఈ విషయాన్ని సదరు మంత్రికి చెబితే ఎక్కడ, ఏం ఇబ్బంది వస్తుందోనని మౌనంగా భరిస్తున్నట్టు ప్రచారం సాగుతున్నది. కొన్ని సార్లు మంత్రులను ఉద్దేశించి సదరు పీఏ ఏకవచనంతో సంబోధించినట్టు ఆరోపణలు ఉన్నాయి. కొందరు సీనియర్ ఎమ్మెల్యేలు ఆ పీఏ తీరును జీర్ణించుకోలేక సీరియస్‌గా క్లాస్ తీసుకుంటే వారి నుంచి వచ్చే ఫోన్లు రిసీవ్ చేసుకోవట్లేదని చర్చ జరుగుతున్నది.కొందరు పీఏ, పీఎస్, ఓఎస్డీలు మంత్రుల అపాయింట్‌మెంట్ ఇప్పించేందుకు రూ.లక్షల్లో వసూలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. డబ్బులు ఇచ్చిన వారికే మంత్రి దినచర్యను మినిట్ టు మినిట్ చేరవేస్తారనే ప్రచారం ఉన్నది. వ్యాపారవేత్తలు, బడా కంపెనీల ప్రతినిధుల వద్ద కూడా మంత్రుల పేషీ స్టాఫ్ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు విమర్శలున్నాయి. మంత్రిని కలిసిన వెంటనే ఆ విజిటర్‌కు ఫోన్ చేసి డబ్బులు ఎక్కడ ఇవ్వాలి..? ఎవరికి ఇవ్వాలి? అనేది మెసేజ్ చేస్తున్నట్టు సమాచారం. అడిగినంత ఇవ్వకపోతే మంత్రి బిజీగా ఉన్నారని, ఇప్పట్లో కలవడం సాధ్యం కాదని సమాధానం చెబుతున్నట్టు ప్రచారంలో ఉన్నది. ఓ మంత్రి పీఏ ఫ్యాషన్ డిజైనర్ డిజైన్ చేసిన దుస్తులు మాత్రమే వాడుతున్నట్టు బీఆర్ఎస్ వర్గాల్లో టాక్ ఉన్నది.

# వాస్తు దోషం....క్యాంప్ ఆఫీసుకు దూరం

**అదిలాబాద్ :**

మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే దివాకర్ రావు క్యాంప్ ఆఫీస్ కు నిత్యం రాకపోవడంతో క్యాంప్ ఆఫీస్ కాస్త బోసి పోయి కనిపిస్తుంది. క్యాంప్ ఆఫీస్ ప్రాంగణంలో ఎటువంటి బోర్డు గానీ క్యాంప్ ఆఫీస్ అని తెలియజేసే సూచికలు కూడా లేకపోవడం విడ్డూరం. ఆఫీస్ కి వాస్తు దోషం ఉందని మళ్లీ వచ్చే ఎలెక్షన్స్ లో కొడుకు విజిత్ రావు ఎమ్మెల్యేగా గెలవాలంటే సొంత ఇంట్లోనే ఉండడం మంచిది అనే విషయాన్ని పలువురు ఎమ్మెల్యే దివాకర్ రావుకు చెప్పడంతో ఆ ఊహాగానాల్లో ఉన్న ఎమ్మెల్యే దివాకర్ రావు తనతోపాటు తన సిబ్బందిని, ఆఫీస్ ని కూడా సొంత ఇంట్లోనే కొనసాగిస్తున్నారు.ఎమ్మెల్యేలు నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ. కోటి చొప్పున వెచ్చించి ప్రతి నియోజకవర్గానికి ఒక ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ను నిర్మించింది. అందులోనే ఎమ్మెల్యేలు ఉంటే నియోజకవర్గ ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి నేరుగా ఎమ్మెల్యేను కలిసి విన్నవించుకునే అవకాశంతో పాటు ఎమ్మెల్యేకు సైతం అధికారులను క్యాంప్ ఆఫీస్ కి పిలిపించుకుని సమస్యలకు సంబంధించిన సమావేశాలు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉండేది. కానీ మంచిర్యాల నియోజకవర్గ ప్రజలు, అధికారులు, ఇతర పనుల కోసం వచ్చేవాళ్లకు ఎమ్మెల్యే సొంత ఇల్లే ఆఫీస్ గా మారింది.అనుకున్నా సమయానికన్నా ముందే క్యాంప్ ఆఫీస్ నిర్మాణం పూర్తి అయినప్పటికీ పలు రాజకీయ విమర్శల మధ్య ఆలస్యంగా గృహ ప్రవేశం చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుండి ఇప్పటి వరకు క్యాంప్ ఆఫీస్ కు ఎపుడో ఒకసారి ఆలా వెళ్లి ఇలా వస్తున్నారు అనే విమర్శలు ఉన్నాయి. పోయిన ఏడాది జులై నెలలో కురిసిన అకాల వర్షాలకు ఎమ్మెల్యే ఉండే సొంత ఇంటి ప్రాంతం అంతా వరదలు వచ్చి నీళ్లు చేరడంతో ఆ రెండు మూడు రోజులు మాత్రమే కుటుంబ సభ్యులతో క్యాంప్ ఆఫీస్ లో తలదాచుకుని వరద నీళ్లు పోయి ఇంటి దగ్గర అంత శుభ్రం అయినాక వెళ్లి మళ్లీ సొంత ఇంట్లోనే చేరారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే దివాకర్ రావు అపోహలు మాని ప్రభుత్వం నిర్మించిన క్యాంప్ ఆఫీస్ ను వినియోగించుకోవాలని, దానివల్ల నియోజక వర్గ ప్రజలకు, అధికారులకు మేలు జరుగుతుందని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

# ఈ సారి రెండు సీట్లు కూడా రావు

**తిరుపతి :**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరాభవంపై మంత్రి రోజా ఘాటుగా స్పందించారు. 2014లో 23 మందిని కొన్నందుకే 2019లో 23 వచ్చాయని, ఇప్పుడు ఇద్దర్ని కొన్నందుకు వచ్చే ఎన్నికల్లో ఆ రెండు కూడా రావని రోజా జోస్యం చెప్పారు. జగన్‌ను ఎవరు వ్యతిరేకించినా వారికే నష్టమని మంత్రి రోజా అన్నారు. జగన్‌కు సొంత అజెండా, జెండా ఉందని ఆమె పేర్కొన్నారు. అధికారంలో ఉండగా 23మందిని కొన్నారు కాబట్టే చంద్రబాబు 23సీట్లకు పరిమితం అయ్యారని అన్నారు. ఇప్పుడు ఇద్దరిని కొన్నారు కాబట్టి రాబోయే ఎన్నికల్లో ఆ రెండు స్థానాలు కూడా దక్కవని రోజా కామెంట్ చేశారు. చంద్రబాబు చేసే నీచ రాజకీయాలకు భవిష్యత్‌లో ఆయనకే అవి తిరుగబడతాయన్నారు. కొడుకును ముఖ్యమంత్రి చేయాలనే ప్రయత్నం ఫలించదని, వచ్చే ఎన్నికల్లో ప్రజంతా ముఖ్యమంత్రిగా జగన్ మోహన్ రెడ్డిని గెలిపించేందుకు ఫిక్స్ అయ్యారని అన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌పై మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి స్పందించారు. ఒకరిద్దరు ఓటు వేయకుండా మోసం చేసినంత మాత్రాన జగన్‌కు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి వచ్చిన నష్టం లేదని మంత్రి కాకాణి అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌కి వ్యతిరేక ఓటు వేయటం పార్టీ అంతర్గత సమస్యని ఆయన వ్యాఖ్యానించారు. వ్యతిరేక ఓటు వేసిన వారిపై చర్యలుంటాయని తెలిపారు. క్రాస్ ఓటింగ్‌పై అంతర్గత సమావేశాల్లో విశ్లేషణ చేసి ముందుకు



వెళ్తామని అన్నారు. సంఖ్యా బలం ప్రకారం 7 స్థానాల్లో పోటీ చేశామని వెల్లడించారు. చంద్రబాబు చేసుకునే చివరి విజయోత్సవాలు ఇవేనని మంత్రి కాకాణి వ్యాఖ్యానించారు. 2024 చంద్రబాబు చివరి ఎన్నికలని, ప్రజల్లో సార్వత్రిక ఎన్నికలు జరిగినపుడు టీడీపీ విషయం బయటపడుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత, రెండో ప్రాధాన్యత ఉండదని కేవలం ప్రజలకు ఒక ఓటు మాత్రమే ఉంటుందని అన్నారు. ఈ ఫలితాలపై ఆలోచన చేయాల్సిన అవసరం లేదన్నారు. 2024లో వైసీపీ ఘన విజయం సాధించి జగన్ మళ్ళీ సీఎం అవుతారని స్పష్టం చేశారు.జరిగిన దానికి చంద్రబాబే సంజాయిషీ ఇవ్వాలని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. పోటీలో దిగాం కాబట్టి ప్రయత్నం చేశామని, పిలిచి మాట్లాడాం కూడా అని చెప్పారు. తమ వైపు నుంచి చేయాల్సిన ప్రయత్నాలు అన్నీ చేశామని ఆయన వ్యాఖ్యానించారు. అక్కడ డబ్బు పని చేసినప్పుడు దాని మీద సంజాయిషీ ఇవ్వాల్సిన అవసరం లేదని, చంద్రబాబే సంజాయిషీ ఇవ్వాలని సజ్జల అన్నారు. ఏ నమ్మకంతో ఆ ఇద్దరు తెలుగు దేశానికి ఓటు వేశారో అందరికి తెలుసని అందుకు బలమైన కారణం డబ్బేననిన సజ్జల వ్యాఖ్యానించారు. చంద్రబాబునాయుడికు శాశ్వతంగా 23 స్థానాలు రావని ఆయనే ఒప్పుకుంటున్నారని 23 వారికి అచ్చొచ్చిన ఫిగర్ అయితే ఆయన్ని కంగ్రాట్స్ చేస్తున్నామని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు జగన్ చేపట్టిన సంస్కరణలు అందుకుంటున్నారని, కాబట్టి 175కు 175 గెలుస్తాం అన్న నమ్మకంతో ఉన్నామన్నారు. దానికి దీనికి అసలు సంబంధం లేదని ఆయన అన్నారు.చంద్రబాబు 175 స్థానాల్లో ఎందుకు పోటీ చేయలేకున్నారో స్పష్టం చేయాలని సజ్జల డిమాండ్ చేశారు. నిజంగా చంద్రబాబు ఎమ్మెల్సీ ఎన్నికలను చూసి బలపడ్డామనుకుంటే 175కు ఎందుకు పోటీ చేయలేకపోతున్నారో స్పష్టం చేయాలన్నారు. ఏ పార్టీ అయినా వారి విధానాలు వారి మేనిఫెస్టోలో స్పష్టంగా చెబుతారని అడ్డదారులు తొక్కి ఓట్లు వేయమనడం కరెక్టా అని సజ్జల అన్నారు.

# ఆర్టీసీలో డైనమిక్ ప్రైసింగ్

**హైదరాబాద్:**

తీవ్ర నష్టాల్లో ఉన్న తెలంగాణ ఆర్టీసి చేస్తున్న సంస్కరణలు ఒక్కక్కోటి మంచి ఫలితాలు ఇస్తుండడంతో మరో కొత్త విధానాన్ని తీసుకోచ్చింది. విమానాలు, పెద్ద పెద్ద హోటల్స్‌లో ఉండే ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌లో డైనమిక్ ప్రైసింగ్ ని ప్రవేశపెట్టింది. దీని ద్వారా దూరపు ప్రాంత ప్రయాణికులను ఆర్టీసీ వైపు మళ్లించేందుకు సరికొత్త ప్రణాళికలతో ఆర్టీసి ముందుకు వచ్చింది.తెలంగాణ ఆర్టీసి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చూడుతుంది. టికెట్ ఆదాయాన్ని పెంచుకోవడానికి దూరపు ప్రాంత ప్రయాణికులు ఆర్టీసీ వైపు వచ్చేలా ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌లో 'డైనమిక్ ప్రైసింగ్' విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఫైలట్ ప్రాజెక్ట్‌గా బెంగళూరు మార్గంలో నడిచే 46 సర్వీసుల్లో ఈ విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తోంది. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం నుంచి బెంగళూరుకు వెళ్లే సర్వీసుల్లో ఈ నెల 27 నుంచి డైనమిక్ ప్రైసింగ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నారు. విమానాలు, హోటళ్లు, ప్రైవేట్ బస్ ఆపరేటర్ల బుకింగ్‌లో ఇప్పటికే అమల్లో ఉన్న డైనమిక్ ప్రైసింగ్‌ను.. త్వరలోనే ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ సదుపాయమున్న సర్వీస్‌లన్నింటిలోనూ అందుబాటులోకి తెచ్చేందుకు టీఎస్ఆర్టీసీ యాజమాన్యం కసరత్తు చేస్తుంది.ప్రయాణికుల రద్దీని బట్టి టికెట్ ధరల్లో హెచ్చు తగ్గులు జరగడమే డైనమిక్ ప్రైసింగ్ విధానం ఉంటుందని.. రద్దీ తక్కువగా ఉంటే సాధారణ చార్జీ కంటే తక్కువగా ఈ విధానంలో టికెట్ ధర ఉంటుందన్నారు ఎండి సజ్జనార్. డిమాండ్ ఎక్కువగా ఉంటే ఆ మేరకు చార్జీలుంటాయి. డైనమిక్ ప్రైసింగ్ విధానంలో అడ్వాన్స్‌డ్ డేటా అనాలసిస్ అండ్ మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్స్ మార్కెట్‌లోని డిమాండ్‌ను బట్టి చార్జీలను నిర్ణయిస్తాయన్నారు. ప్రైవేట్ ఆపరేటర్లు, ఇతర రాష్ట్రాల ఆర్టీసీ బస్సుల బుకింగ్‌లతో పోల్చి టికెట్ ధరను వెల్లడిస్తాయని సజ్జనార్ తెలిపారు.

# పేపర్ లీకేజ్ పై గవర్నర్ ఫోకస్

## నివేదిక ఇవ్వాలని ఆదేశం

**హైదరాబాద్ :**

సంచలనం సృష్టిస్తున్న తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో గవర్నర్ రియాక్ట్ అయ్యారు. పూర్తి వివరాలు తనకు సమర్పించాలని లేఖలు రాశారు. సీఎస్ శాంతికుమారి, టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ జనార్ధన్ రెడ్డి, డీజీపీ అంజనీకుమార్‌కు గవర్నర్ ఆదేశాలు జారీ చేశారు. పూర్తి నివేదిక ఇవ్వాలన్నారు. అదేటైంలో అసలు టీఎస్‌పీఎస్‌సీలో ఎంతమంది పని చేస్తున్నారు. అందులో రెగ్యులర్ ఉద్యోగులు ఎవరు... ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎంతమంది వాళ్ల వివరాలు ఏంటో చెప్పాలని కూడా జనార్ధన్‌ను ఆదేశించారు. సిట్ దర్యాప్తు స్టాటస్ చెప్పాలని సిట్ అధికారులను కూడా ఆదేశించారు. ఈ మధ్యే తనను కలిసిన కాంగ్రెస్ నేతలతో గవర్నర్ తమిళిసై చాలా కీలక వ్యాఖ్యలు చేశారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఆ కామెంట్స్ చేసిన ఒక్కరోజులోనే సమగ్ర నివేదిక కోరడంతో తర్వాత ఏం జరుగుతుందా అనే ఆసక్తి అందరిలో కనిపిస్తోంది. కాంగ్రెస్ నేతలతో సమావేశంలోనే పేపర్ లీక్ పరిణామాలపై సీరియస్‌గా ఉన్నట్లు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సంకేతాలు పంపారు. టీఎస్‌పీఎస్సీ వ్యవహారం, విద్యార్థుల ఆత్మహత్య ఘటనలు తనను ఆవేదనకు గురి చేస్తున్నాయని అన్నట్టు టీ-కాంగ్రెస్ నేతలతో చెప్పడం హాట్ టాపిక్‌గా మారింది. దీన్ని సీరియస్‌గా తీసుకుంటున్నామని అంత ఈజీగా వదిలిపెట్టలేమంటూ కామెంట్ చేశారని కూడా హస్తం నేతలు చెప్పారు. కాంగ్రెస్ నేతలు చెప్పినట్టు పేపర్ లీకేజీపై గవర్నర్ సీరియస్‌గా ఉంటే తర్వాత ఏం చేస్తారు. ఈ వ్యవహారంలో ఆమెకు ఉన్న అధికారాలు ఏంటీ అన్న చర్చ మొదలైంది. ఇప్పటికే ప్రభుత్వానికి గవర్నర్‌కు పొసగడం లేదు. చాలా కాలంగా రెండు వ్యవస్థల మధ్య వార్ నడుస్తోంది. చాలా కీలకమైన బిల్లులు గవర్నర్ పెండింగ్‌లో పెట్టుకొని క్లియర్ చేయడం లేదని ఏకంగా కోర్టునే ఆశ్రయించింది ప్రభుత్వం. ఇది ఇంకా కోర్టులో విచారణ కొనసాగుతోంది. ఈ మధ్య దీనిపై విచారణ చేసిన సుప్రీంకోర్టు కేంద్రానికి నోటీసులు జారీ చేసింది కేసు విచారణ వాయిదా వేసింది. బిల్లుల క్లియరెన్స్‌పై వివాదం నడుస్తుండగానే ఇప్పుడు గవర్నర్ తన దృష్టిని టీఎస్‌పీఎస్సీ పెట్టారు. ఏం జరుగుతోంద తనకు చెప్పాలని ఆదేశాలు జారీ చేశారు. పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాత ఆమె చేయబోతున్నారనేది కీలకంగా మారనుంది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ రాసిన ఉద్యోగులపై జాబితాను తీసిన సిట్... వారి మార్కులను తెలుసుకునే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో టీఎస్పీఎస్సీ ఉద్యోగుల్లో మరో ఇద్దరికి గ్రూప్ 1 ప్రిలిమ్స్ లో అత్యధిక మార్కులు వచ్చినట్లు సిట్ అధికారులు గుర్తించారు. 2013లో గ్రూప్-2 ఉద్యోగం సాధించిన షమీమ్‌కు గ్రూప్ 1 ప్రిలిమ్స్ లో 127 మార్కులు, టీఎస్పీఎస్సీలో పొరుగుసేవల ఉద్యోగిగా పనిచేస్తున్న రమేశ్‌కు 122 మార్కులు వచ్చినట్లు సిట్ అధికారుల దర్యాప్తులో తేలింది. పేపర్ల లీకేజీ కేసులో ం2 నిందితుడు రాజశేఖర్ నుంచి గ్రూప్-1 ప్రిలిమ్స్ పేపర్ పొందినట్లు షమీమ్ ఒప్పుకున్నాడు. అందుకు తాను డబ్బులు చెల్లించలేదని తెలిపాడు. పేపర్ల లీకేజీలో మరో కోణం వెలుగు చూస్తుంది. నిందితుల సెల్ ఫోన్లలోని డేటా, వాట్సప్ చాట్, గ్రూపుల ఆధారంగా సిట్ దర్యాప్తు చేస్తుంది. ఈ సమాచారంతో గ్రూప్-1 ప్రిలిమ్స్ రాసి మెయిన్స్ కు అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను తయారుచేసేందుకు సిట్ ప్రణాళిక సిద్ధం చేసింది. టీఎస్పీఎస్సీలో పలు విభాగాల్లో పనిచేస్తున్న 8 మంది ఉద్యోగులు... గత అక్టోబరులో జరిగిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రాసినట్లు సిట్ అధికారులు గుర్తించారు. వీరిలో కొందరు ఉద్యోగులు 100కు పైగా మార్కులు సాధించినట్లు తెలుస్తోంది. ఆ సమాచారం సేకరణలో పడింది సిట్ బృందం.

# డా.వైఎస్సార్ విత్తన పరిశోధన, శిక్షణ కేంద్రానికి శంకుస్థాపన

**గన్నవరం**

గన్నవరంలోని ఏపీఎస్ఎస్డిసి ఆవరణలో రాష్ట్ర మంత్రులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఆర్కే.రోజా, రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ ఛైర్మన్ నాగిరెడ్డి, సంస్థ ఛైర్ పర్సన్ హేమసుశ్మిత శంకుస్థాపన చేసారు. మంత్రులు మాట్లాడుతూ వ్యవసాయశాఖలో నూతన అధ్యయనానికి ఈ కేంద్రం ఎంతో దోహద పడుతుందని అన్నారు. పనిలో పనిగా తెదేపా అధినేత చంద్రబాబుపై ఘాటు విమర్శలు చేసారు. అసెంబ్లీకి రానన్న చంద్రబాబు ఎందుకు వచ్చారని మంత్రి రోజా ప్రశ్నించారు. అధికారంలో ఉండగా 23 ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన చంద్రబాబు 23 సీట్లతో ప్రతిపక్షంలో కూర్చొబెట్టారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇద్దరు ఎమ్మెల్యేలను కొనుగోలు చేశారు. 2024 సాధారణ ఎన్నికల్లో ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే తెదేపా కు మిగులుతారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీమోహన్, వైకాపా ప్రజాప్రతినిధులు పాల్గోన్నారు.

## సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దగ్ధం

**హైదరాబాద్**



ఉస్మానియా యూనివర్సిటీ ఎన్సిసి గేటు వద్ద ప్రభుత్వం కెసిఆర్ గారి దిష్టిబొమ్మను హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోతారోహిత్ ఆధ్వర్యంలో కాల్చారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణకి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు .టీఎస్పీఎస్సీ ఎగ్జామ్ లీకేజీ విషయంలో ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ మరియు తనయుడు కేటీఆర్ విచారణ జరగక ముందే కేవలం ఇద్దరే దీంట్లో పాత్రధారులు ఉన్నారని తేల్చేయడం విడ్డూరంగా ఉందని అంటే విచారణలో నిజాయితీ లేదని తెలిపోతుందని, అదేవిధంగా టిఎస్పిఎస్సి లో ఔట్సోర్సింగ్ పద్ధతిలో కేటీఆర్ మంత్రిత్వ శాఖ నియామకాలు జరుపుతున్నప్పుడు కేటీఆర్ పాత్ర దీంట్లో ఉందని వాదనలు వస్తున్నప్పుడు కేటీఆర్ కి ఎందుకు నోటీసులు ఇచ్చి విచారణ జరపట్లేదు అని చెప్పేసి ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాము అందుకే వెంటనే విచారణను సిబిఐ కి లేదా సిట్టింగ్ జడ్జ్ కి బదులయించాలని యూత్ కాంగ్రెస్ హైదరాబాద్ అధ్యక్షుడు మోతారోహిత్ డిమాండ్ చేశారు

## నిరుద్యోగ మహా ధర్నా

**భద్రాద్రి కొత్తగూడెం**

కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ లో బిజెపి అధ్వర్యంలో నిరుద్యోగ మహా ధర్నా నిర్వహించారు. గ్రూప్ పరీక్షలు రాసిన ప్రతి విద్యార్థికి లక్ష రూపాయల పరిహారం ఇవ్వలి. సిట్టింగ్ జడ్జ్ తో విచారణ జరిపించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, నిరుద్యోగ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గోన్నారు

## కౌరవ సభను తలపించారు

**మదనపల్లె**

ఎంఎల్సీ ఎన్నికల్లో టిడిపి గెలుపును వోర్వలేని వైసిపి ప్రభుత్వం శాసనసభను కౌరవసభ తలపించే విధంగా తమ శాసనసభ్యుల పై దాడులు చేసిందని అన్నమయ్య జిల్లా మదనపల్లే మాజీ ఎమ్మెల్యే, టిడిపి నాయకులు షాజహాన్ బాషా విమర్శించారు. నేడు మదనపల్లె పట్టణం బెంగళూరు బస్టాండులోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగూర్ వలి, గిరీష్, ఇంతియాజ్, శ్రీరామ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా షాజహాన్ బాషా మాట్లాడుతూ శాసనసభలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సారధ్యంలో వైకాపా ఎమ్మెల్యేలు తమ టిడిపి ఎమ్మెల్యేల పై దాడులు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

**గూడూరు**

తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం కడివేడు గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇంజనీరింగ్ విద్యార్థి వినయ్ కుమార్ గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు . బాధితుని సమాచారం మేరకు కోట మండలం విద్యానగర్ గ్రామంలో ఉన్న ఎన్బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్న వినయ్ మోటార్ సైకిల్ పై విద్యానగర్ నుండి సర్వేపల్లి కి వెళుతున్న క్రమంలో కడివేడు గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు ఆటోను ఢీకొనడంతో గాయపడి గూడూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు

## సీసీ టీవీ ఫుటేజ్‌లో దొరికిపోయిన పేపర్ ఎక్సేంజ్ వ్యవహారం

**హైదరాబాద్**

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసు రిమాండ్ రిపోర్ట్‌లో కీలక అంశాలు వెలుగు చూశాయి. ఇప్పటి వరకూ 12 మంది నిందితులను ఆరెస్ట్ చేసినట్టు రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ పేర్కొంది. తొమ్మిది మంది నిందితులతో పాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు. ముగ్గురిలో ఇద్దరు టీఎస్‌పీఎస్సీ ఉద్యోగులు ఉన్నారు. ఇప్పటి వరకూ మొత్తంగా నలుగురు టీఎస్‌పీఎస్సీ ఉద్యోగులను అధికారులు అరెస్ట్ చేశారు. ౦1ప్రవీణ్ టీఎస్‌పీఎస్సీ సెక్రెటరీ పీఏ, ౦2 రాజశేఖర్, నెట్వర్క్ అడ్మిన్, ౦10 షమీమ్ ఏఎస్ఓ, ౦12 రాజశేఖర్ డాటా ఎంట్రీ ఆపరేటర్ అరెస్టైన వారిలో ఉన్నారు.

నిందితుల్లో మరో నలుగురు ప్రభుత్వ ఉద్యోగులున్నట్టు రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ పేర్కొంది. 19 మంది సాక్ష్యులను విచారించినట్టు రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ పేర్కొంది. టీఎస్‌పీఎస్సీ ఉద్యోగి శంకర్ లక్ష్మిని ప్రధాన సాక్షిగా సిట్ పేర్కొంది. శంకర్ లక్ష్మితో పాటు టీఎస్‌పీఎస్సీ, తెలంగాణ స్టేట్ టెక్నికల్ సర్వీస్ ఉద్యోగులను సాక్షులుగా సిట్ వెల్లడించింది. కర్మన్ ఘాట్‌లోని ఒక హోటల్‌లోని యాజమని, ఉద్యోగిని సాక్షిగా సిట్ తెలిపింది. హోటల్‌లోని సీసీటీవి కెమెరాలో పేపర్ ఎక్సేంజ్ వ్యవహారం నిక్షిప్తమైంది. ప్రవీణ్, రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు షమీమ్, రమేష్, సురేష్ లను సిట్ అరెస్ట్ చేసింది. ముగ్గురు నిందితుల నుంచి ఒక ల్యాప్ టాప్, మూడు మొబైల్ ఫోన్స్‌ను సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

# మహిళా రిజర్వేషన్ల కోసం ఉద్యమం ఉధృతం

**మేధావులకు కల్వకుంట్ల కవిత పోస్టు కార్డులు**

**కార్యాచరణను ప్రకటించిన కవిత**

**హైదరాబాద్**

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించడానికి మహిళా బిల్లును తీసుకురావాలంటూ కల్వకుంట్ల కవిత ఉద్యమాన్ని ఉధృతం చేశారు. ఇప్పటికే జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష చేయడంతోపాటు దాదాపు 18 పార్టీలతో , ఆయా మహిళా, సంఘాలతో సంఘాలతో భారత్ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశం




నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ పార్లమెంటు సమావేశాల్లోనే మహిళా బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని కవితతో పాటు పలు పార్టీల నేతలు డిమాండ్ చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం విస్మరించినందున ఆందోళనని మరింత తీవ్ర రూపం చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా దేశవ్యాప్తంగా వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేపట్టనున్నారు. మిస్డ్ కాల్ కార్యక్రమాన్ని మొదలుపెట్టడంతోపాటు దేశంలో యూనివర్సిటీలు, కాలేజీల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు మరియు చర్చలు నిర్వహించనున్నారు. వచ్చే నెలలో ఈ కార్యక్రమాలు నిర్వహించేలా కవిత ప్రణాళిక రూపొందించారు.

మహిళా బిల్లుకు మద్దతు కోసం దేశంలోని ప్రముఖ విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, ఆలోచనపరులు, మేధావులకు కల్వకుంట్ల కవిత పోస్టు కార్డులు వ్రాయనున్నారు. మహిళా బిల్లు ఉద్యమాన్ని విస్తరించడంలో భాగంగా ఆమె సామాజిక మాధ్యమాల్లో ఒక పోస్టర్ ను విడుదల చేశారు.

# ఆంధ్రాకు వచ్చిన తల్లిపులి

**కర్నూలు :**

ఇటీవలే నాలుగు పులి పిల్లలకు జన్మనిచ్చిన ఓ పులి ఏపీ నుంచి తెలంగాణలోకి వచ్చినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం పెద్ద గుమ్మడాపురం ప్రాంతంలో చెట్లపొదల్లో నాలుగు ఆడపులి పిలల్లకు జన్మనిచ్చింది. అయితే 6వ తేదీన పిల్లలను వదిలి కృష్ణా నది దాటి తెలంగాణలోని కొల్లాపూర్ సమీపంలో ఉన్న నల్లమల అడవులకు చేరిందని స్థానిక అటవీ శాఖ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. అయితే ఈ క్రమంలోనే కొల్లాపూర్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని సులాలకుంట అటవీ ప్రాంతంలో.. అటవీ శాఖ అధికారులు అమర్చిన సీసీటీవీ కెమెరాలో ఓ ఆడ పులి ట్రాప్ అయినట్లు రెండ్రోజుల క్రితం గుర్తించారు. అయితే ఆంధ్రా నుంచి వచ్చిన పులేనా లేక మరో పులా అన్న విషయమై అధికారులు ఇంకా స్పష్టత ఇవ్వలేదు. ఈ క్రమంలోనే ఈ పులిని గుర్తించే పనిలో పడ్డారు అటవీ శాఖ అధికారులు. ఈనెల 21వ తేదీన అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ క్షితజ దంపతులు సంగమేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. ఏపీలోని ఆత్మకూరు అటవీ డివిజన్ అధికారులు అక్కడకు చేరుకొని ఆమెను కలిశారు. అక్కడి నుంచి పిల్లలకు జన్మనిచ్చిన తల్లి పులి నల్లమలకు చేరినట్లు సమాచారం అందించారు. దీంతో ఆమె కొల్లాపూర్ రేంజ్ అధికారులను అప్రమత్తం చేశారు. అధికారులు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. రెండ్రోజుల క్రితం సులాలుకుంట ప్రాంతంలో ఆడ పులి సంచరించిన దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తం అయ్యారు. ఈ విషయంపై ఇరు ప్రాంతాల అటవీ శాఖ అధికారులు ఇంకా స్పష్టతను ఇవ్వలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆత్మకూరులో తల్లి నుండి వేరు అయిన నాలుగు పులి పిల్లలు లభ్యమైన విషయం తెలిసిందే. ఇప్పటికే పెద్దపులి సంచారంతో భయపడ్డ గ్రామస్థులు.. పులి పిల్లలను చూసి తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించి నాలుగు పులి పిల్లలను రక్షించారు. పులి పిల్లల కోసం పులి వస్తుందేమో అని ఫారెస్టు అధికారులు అనేక విధాలుగా ప్రయత్నం చేసినా పెద్దపులి జాడ ఏమాత్రం కనిపించలేదు. అయితే ఈ పులి కూనల సంరక్షణార్థం తిరుపతి ఎస్వీ జూ పార్కుకు అప్పగించారు. జూపార్కులో ఏసీఎఫ్ నాగభూషణం మీడియాతో మాట్లాడుతూ.. నంద్యాల జిల్లా ఆత్మకూరు ప్రాజెక్టు పరిధిలో 50 రోజుల వయసు కలిగిన పులి పిల్లలను అక్కడి జూ అధికారులు మహమ్మద్ సయ్యద్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుభాష్, ఎస్కార్ట్ సిబ్బందితో కలిసి అప్పగించారని తెలిపారు. వెటర్నరీ డాక్టర్ల పర్యవేక్షణలో వాటి ఆరోగ్య పరిస్థితిని పరీక్షించినట్లు వివరించారు. తల్లి నుండి విడిపోయిన తర్వాత ఫీడింగ్ లేక పోవడంతో కొంత బలహీనంగా ఉన్నాయన్నారు. వైద్యుల పర్యవేక్షణలో బలవర్ధకమైన ఫీడింగ్ అందజేసి, మంచి వాతావరణంలో పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటే, ఏసీలో వాటిని ఉంచి రక్షిస్తామని అన్నారు. వెటర్నరీ వైద్యులతో తరచుగా తనిఖీ చేయిస్తుంటామన్నారు.

# రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు

**నాలుగుకు చేరిన ఉద్యోగుల అరెస్ట్**

**హైదరాబాద్**

పేపర్ లీకేజ్ కేసులోని రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు బయటపడ్డాయి. ఇప్పటికి వరకు 12 మంది నిందితులను ఆరెస్ట్ చేసినట్టు రిమాండ్ రిపోర్టులో సిట్ పేర్కొంది. తొమ్మిది మంది నిందితులతో పాటు మరో ముగ్గురు అదుపులోకి తీసుకున్నారు అధికారులు. ఆ ముగ్గురిలో ఇద్దరు టీఎస్పిఎస్సీ ఉద్యోగులే. వీరితో కలిపి ఇప్పటివరకు నలుగురు టీఎస్పిఎస్సీ ఉద్యోగుల అరెస్ట్ అయ్యారు. వారిలో ౦1ప్రవీణ్ టీఎస్పిఎస్సీ సెక్రటరీ పీఏ, ౦2 రాజశేఖర్, నెట్వర్క్ అడ్మిన్ : ౦10 షమీమ్ యాా, ౦12 రాజశేఖర్, డాటా ఎంట్రీ ఆపరేటర్. 19మంది సాక్ష్యులను విచారించినట్టు రిమాండ్ రిపోర్టులో సిట్ పేర్కొంది. టీఎస్పిఎస్సీ ఉద్యోగి శంకర్ లక్ష్మి ని ప్రధాన సాక్షిగా చేర్చారు. శంకర్ లక్ష్మి తో పాటు టీఎస్పిఎస్సీ, తెలంగాణ స్టేట్ టెక్నికల్ సర్వీస్ ఉద్యోగులను కూడా సాక్షులుగా పేర్కొన్నారు. కర్మన్ ఘాట్ లోని ఒక హోటల్ యాజమని, అందులో ఉద్యోగిని కూడా సాక్షిగా చేర్చారు. హోటల్లోని సీసీటీవి కెమెరాలో పేపర్ మార్పిడి వ్యవహారం రికార్డయినట్టుగా సిట్ గుర్తించింది. ప్రవీణ్, రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు షమీమ్, రమేష్, సురేష్ ను ఆరెస్ట్ చేశారు. ముగ్గురు నిందితుల నుంచి ఒక ల్యాప్ టాప్ మూడు మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. పేపర్ లీకేజ్ నిందితులకు గురువారం నాటికి పోలీస్ కస్టడీ విచారణ ముగిసింది. తాజాగా అరెస్ట్ చేసిన సురేష్, రమేష్, షమీమ్‌కి ఏప్రిల్ 4 వరకు జుడిషియల్ రిమాండ్ విధించారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్ లో షమీమ్‌కి 126 మార్కులు, రమేష్‌కి 120 మార్కులు వచ్చినట్లు గుర్తించారు. షమీమ్‌కి వాట్సాప్‌లో గ్రూప్ 1 పేపర్ రాజశేఖర్ రెడ్డి పంపాడు. ఈ క్రమంలో గురువారం రాత్రి షమీమ్ ఇంట్లో సోదాలు చేసింది సిట్ బృందం. గ్రూప్-1 లో వందకు పైగా మార్కులు వచ్చిన 121 మందిని గుర్తించి.. అందులో కొందరికి నోటీసులిచ్చారు. ఇందులో కొందరు విదేశాల్లో ఉన్నట్లు తెలిసింది. రాజశేఖర్ రెడ్డి బంధువు న్యూజిలాండ్ నుంచి వచ్చి ఎగ్జామ్ రాసి వెళ్లినట్లు సిట్ గుర్తించింది. అతనితో పాటు ఇంకొంతమంది ఫారిన్ నుంచి వచ్చి పరీక్ష రాసి వెళ్లినట్లు సమాచారం. ఈటూఒ రిపోర్ట్ కోసం సిట్ అధికారులు ఎదురు చూస్తున్నారు. మొత్తమ్మీద పేపర్ లీక్ వ్యవహారంలో కీలక సూత్రదారి రాజశేఖరే అని తేల్చింది సిట్. ఉద్దేశపూర్వకంగానే రాజశేఖర్ యాఖూఅకి డిప్యుటేషన్‌పై వచ్చాడని తేలింది. టెక్నికల్ సర్వీస్ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చాడు. సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్న రాజశేఖర్ కంప్యూటర్‌ని హ్యాక్ చేసి పాస్‌వర్డ్‌ని దొంగిలించాడు. పాస్‌వర్డ్‌ని తాను ఎక్కడా రాయలేదని శంకర్ లక్ష్మి చెప్పింది అబద్ధమని తేలింది. శంకర్ లక్ష్మి చెప్పిన ప్రకారమే కంప్యూటర్ హ్యాక్ చేసినట్లు గుర్తించారు. పెన్‌డ్రైవ్ ద్వారా 5 పరీక్షా పత్రాలను కాపీ చేశాడు రాజశేఖర్. కాపీచేసిన పెన్‌డ్రైవ్‌ను ప్రవీణ్‌కు ఇచ్చాడు. ౦ఇ పరీక్ష పత్రాన్ని ప్రవీణ్ రేణుకకు అమ్మాడు. ఫిబ్రవరి 27నే పేపర్‌ను రాజశేఖర్ కాపీ చేసనట్టు తేలింది. గ్రూప్-1 లో ప్రవీణ్‌కు 103 మార్కులు రావడంపైనా సిట్ విచారణ చేసింది.

# మంచు ఫ్యామిలీలో గొడవలు

**హైదరాబాద్**

మంచు మనోజ్, విష్ణు మధ్య విభేదాలున్నాయంటూ కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ గొడవల కారణంగానే కుటుంబం నుంచి విడిపోయి మనోజ్ వేరుగా ఉంటున్నారన్న గుసగుసలూ వినిపించాయి. ఇప్పుడీ అనుమానాలకు తెరపడింది. మంచు మనోజ్ దగ్గర పని చేసే సారథి అనే వ్యక్తి ఇంటికెళ్లి మంచు విష్ణు గొడవ పడ్డారు. అతనిపై దాడి చేసేందుకూ ప్రయత్నించినట్టు సమాచారం. చాలా కాలంగా మంచు కుటుంబంతో సన్నిహితంగా ఉంటున్న సారథి...మనోజ్ దగ్గర పనిచేయడంపై విష్ణు ఆగ్రహంగా ఉన్నట్టు తెలుస్తోంది. అందుకే ఆయన ఇంటికెళ్లి మరీ గొడవ పడ్డారని ప్రచారం జరుగుతోంది. మూడేళ్లుగా మంచు మనోజ్‌కు విష్ణు బర్త్‌డే విషెస్ కూడా చెప్పలేదు. ఇటీవల మనోజ్ పెళ్లిలోనూ విష్ణు పెద్దగా జోక్యం చేసుకున్నట్టు కనిపించలేదు. అంటీముట్టనట్టుగానే ఉన్నారు. ఇప్పుడు విష్ణు..సారథి ఇంటికి రావడంతో వీళ్ల మధ్య విభేదాలు నిజమే అని ఓ క్లారిటీ వచ్చింది. విష్ణు ఇలా పదేపదే ఇంటికి వచ్చి గొడవ చేస్తున్నాడంటూ మనోజ్ ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టాడు. మంచు విష్ణు గొడవ పడ్డ వీడియోని పోస్ట్ చేశాడు. అయితే..ఈ వివాదంపై మోహన్ బాబు సీరియస్ అయిన్టటు తెలుస్తోంది. సోషల్ మీడియాలో ఏంటీ గొడవ అని మందలించినట్టు సమాచారం. అప్పటికే మనోజ్ ఫేస్‌బుక్ పోస్ట్‌ను డిలీట్ చేశారు

## పాలకొల్లులో టీడీపీ సంబరాలు

**ఏలూరు**

టిడిపి తరఫున ఎమ్మెల్యే కోట ఎమ్మెల్సీ అభ్యర్థి పంచుమర్తి అనురాధ 23 ఓట్లతో విజయం సాధించడం తో పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు ఎన్టీఆర్ విగ్రహం వద్ద టిడిపి శ్రేణులు మిఠాయిలు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు జై తెలుగుదేశం జై చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి పాలకొల్లు ఎమ్మెల్యే రామానాయుడు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ 23 మంది ఎమ్మెల్యేలు ఉన్న టిడిపి పార్టీ అంటూ అవహేళన చేసిన వైసీపీని 23 మంది ఓట్లతోనే ఈరోజు ఎమ్మెల్సీ విజయం సాధించామని దీనికి సహకరించిన వైసిపి ఎమ్మెల్యేలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని రాష్ట్ర భవిష్యత్తుకు చంద్రబాబు నాయకత్వాన్ని వైసిపి నాయకులు కూడా కోరుకుంటున్నారని 23వ తారీఖున 23 ఓట్లతో ఎమ్మెల్సీగా పంచమర్తి అనురాధ గెలవటం తమకు అందరికీ ఆనందోత్సాహాలను కలిగించిందన్నారు

## ఆధార్ కార్డుల అనుసంధానంపై ఆర్డీవో సమీక్ష

**గూడూరు**

గూడూరు పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో పట్టణంలోని పోలింగ్ బూత్ లెవెల్ ఆఫీసర్లతో ఆర్డీవో కిరణ్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు ఓటు కార్డుకు ఆధార్ అనుసంధానం పై తక్కువ శాతం నమోదు చేయించిన సంబంధిత బిఎల్ ఓ ల పై ఆర్డీవో ఆగ్రహం వ్యక్తం చేశారు సోమవారం కల్లా 100% పూర్తి కావాలని ఆదేశించారు ఆర్డీవో కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఓటు కార్డుకు ఆధార్ అనుసంధానం గూడూరు నియోజకవర్గంలో 85% మాత్రమే పూర్తయిందని ఇంకా 15% పూర్తి కావాల్సి ఉందని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చామని తెలిపారు ఓటు కార్డుకు ఆధార్ అనుసంధానం వల్ల బోగస్ ఓటర్లు తొలగించబడతాయని నిజమైన ఓటరు మాత్రమే ఉంటారని అన్నారు త్వరలో అఖిలపక్ష రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి తొలగింపు ఓటర్లపై చర్చిస్తామని వెల్లడించారు ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ ,తాసిల్దార్ లీలారాణి ,బిఎల్వోస్ పాల్గొన్నారు .

## మంచు ఫ్యామిలీలో గొడవలు

**హైదరాబాద్**

మంచు మనోజ్, విష్ణు మధ్య విభేదాలున్నాయంటూ కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ గొడవల కారణంగానే కుటుంబం నుంచి విడిపోయి మనోజ్ వేరుగా ఉంటున్నారన్న గుసగుసలూ వినిపించాయి. ఇప్పుడీ అనుమానాలకు తెరపడింది. మంచు మనోజ్ దగ్గర పని చేసే సారథి అనే వ్యక్తి ఇంటికెళ్లి మంచు విష్ణు గొడవ పడ్డారు. అతనిపై దాడి చేసేందుకూ ప్రయత్నించినట్టు సమాచారం. చాలా కాలంగా మంచు కుటుంబంతో సన్నిహితంగా ఉంటున్న సారథి...మనోజ్ దగ్గర పనిచేయడంపై విష్ణు ఆగ్రహంగా ఉన్నట్టు తెలుస్తోంది. అందుకే ఆయన ఇంటికెళ్లి మరీ గొడవ పడ్డారని ప్రచారం జరుగుతోంది. మూడేళ్లుగా మంచు మనోజ్‌కు విష్ణు బర్త్‌డే విషెస్ కూడా చెప్పలేదు. ఇటీవల మనోజ్ పెళ్లిలోనూ విష్ణు పెద్దగా జోక్యం చేసుకున్నట్టు కనిపించలేదు. అంటీముట్టనట్టుగానే ఉన్నారు. ఇప్పుడు విష్ణు..సారథి ఇంటికి రావడంతో వీళ్ల మధ్య విభేదాలు నిజమే అని ఓ క్లారిటీ వచ్చింది. విష్ణు ఇలా పదేపదే ఇంటికి వచ్చి గొడవ చేస్తున్నాడంటూ మనోజ్ ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టాడు. మంచు విష్ణు గొడవ పడ్డ వీడియోని పోస్ట్ చేశాడు. అయితే..ఈ వివాదంపై మోహన్ బాబు సీరియస్ అయిన్టటు తెలుస్తోంది. సోషల్ మీడియాలో ఏంటీ గొడవ అని మందలించినట్టు సమాచారం. అప్పటికే మనోజ్ ఫేస్‌బుక్ పోస్ట్‌ను డిలీట్ చేశారు.

## 16 మంది మావోయిస్టులు లొంగుబాటు

**సుక్మా**

ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో పోలీసుల ఎదుట 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు. సుక్మా జిల్లా చింతగుప్ప,పోలంపల్లి ప్రాంతాలకు చెందిన 16 మంది మావోయిస్టులు లొంగిపోయారు. గత కొంతకాలంగా వీరంతా మావోయిస్టు పార్టీకి చెందిన పలు అజ్ఞాత దళాల్లో పని చేస్తూ వివిధ సంఘటనల్లో ప్రమేయం ఉన్నవారు. 16 మంది కూడా పోలీసుల ప్రచారానికి ఆకర్షితులై ఈరోజు సుక్మా జిల్లా ఎస్పీ సునీల్ శర్మ, ఎదుట లొంగిపోయారు.

## పాలేరులో సీపిఎం పోటీ

**ఖమ్మం**

ఖమ్మం జిల్లా కూసుమంచి లో సీపీఎం జన చైతన్య యాత్ర లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాల్గోన్నారు. తమ్మినేని మాట్లాడుతూ సీపీఎం పార్టీ మాటకు కట్టుబడి ఉంటుంది. పాలేరు సీటు రాష్ట్రంలో నే ప్రాధాన్యత ఉన్న సీటు. పాలేరు టిక్కెట్ సీపీఎం పార్టీ కి అడిగేది నిజం. కేసీఆర్ తో జరిగే చర్చల్లో ఉపేందర్ రెడ్డి కి పాలేరు టిక్కెట్ ఇస్తే ఊరూరు తిరిగి గెలిపెంచేందుకు కృషి చేస్తా. సీపీఎం పార్టీ కి పాలేరు టిక్కెట్ కేటాయిస్తే అదే విధంగా గెలిపిస్తామని చెప్పారు. బీఆర్ఎస్, సిపిఎం సీపీఐ మధ్య గ్రామస్థాయిలో తగాదాలు ఉండొచ్చు కానీ మా స్థాయిలో లేదు. ఐకమత్యంగా పనిచేసి బీజేపీ ని రాకుండా చేద్దాం. ఒక్క బీజేపీ ఏ కాదు సీపీఎం, సీపీఐ,బీఆర్ ఎస్ కు ప్రత్యర్థులు గా ఉన్న ఏ శక్తి అయిన సరే. ఖమ్మం జిల్లాలో ఎర్ర జెండా తో కలిసి పోటీ చేసిన ఏ పార్టీ కూడా ఓటమి చెందలేదు. బీఆర్ఎస్ ‌ా నుంచి బయటకు పోయిన వాళ్ళు జంక్షన్ లో ఉన్నారు ఏరోడ్డు కు వెళ్తారో తెలియదని అన్నారు.

# బాసర' ఆలయ పునఃనిర్మాణానికి శ్రీకారం

## భూమిపూజలో పాల్గొన్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

**బాసర**



బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు అంకురార్పణ జరిగింది. దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సరస్వతి అమ్మవారి గర్భాలయ పునఃనిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే విఠల్ రెడ్డితో కలిసి మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు.
ఆలయ పునర్నిర్మాణానికి సీయం కేసీఆర్ రూ.50 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఇప్పటికే రూ.8కోట్ల వ్యయంతో ఆలయ పరిసరాల్లో విశ్రాంతి భవనాలు, తదితర పనులు చేపట్టగా, రూ.22 కోట్లతో ప్రస్తుతం ఉన్న గర్భాలయాన్ని కృష్ణశిలలతో అత్యద్భుతంగా నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వరుణ్ రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# నిరుద్యోగ మహాధర్నాను విజయవంతం చేయండి

**పెద్దపల్లి**



నిరుద్యోగులకు జరిగిన అన్యాయానికి బీజేపీ పార్టీ అండగా నిలిచి పోరాటం చేస్తున్నదని, మా నౌకరీలు మాగ్గా వాలే మహా ధర్నాను విజయవంతం చేయాలని బీజేపీ నాయకుడు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు లక్ష రూపాయల నష్టపరిహారం, మంత్రి కేటీఆర్ ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈనెల 25న హైదరాబాదులో తలపెట్టిన నిరుద్యోగ మహాధర్నా కు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ ఇన్నేళ్లకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చినట్లే ఇచ్చి పేపర్ లీకేజీ అంశంతో ఆ పరీక్షలను రద్దుచేసి నిరుద్యోగుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాట మాడుతుందనే విషయం దీంతో స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వలేని దౌర్భాగ్య స్థితి తెలంగాణలో ఉందన్నారు. నిరుద్యోగుల వ్యతిరేక కేసీఆర్ సర్కార్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడానికి బీజేపీ ఎనలేని పోరాటం చేస్తుందన్నారు. పేపర్ లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని నియోజక వర్గంలో నిరసన దీక్ష చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన కనుసనల్లో పనిచేసే సిట్ వ్యవస్థతో పేపర్ లీకేజీ వ్యవహారాన్ని మరుగునపెట్టే ఆస్కారం ఉందని, ఇదివరకు అనేక అంశాల్లో వేసిన సిట్ దర్యాప్తుల సంగతి ఏంటో ప్రతి ఒక్కరికి తెలుసన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేసిన సిట్ పై ఎవరికీ నమ్మకం లేదని,అందుకే నిరుద్యోగులకు న్యాయం చేయాలంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ పార్టీ మొదటి నుండి డిమాండ్ చేస్తుందన్నారు. 30 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలను కేసీఆర్ ప్రభుత్వం రోడ్డుపాలు చేసిందన్నారు. నిరుద్యోగులకు అండగా నిలిచి వారి సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వంపై బీజేపీ తగిన పోరాటం చేస్తుందన్నారు.

# ప్రధాని మోడీ పై రేణుక చౌదరి పరువునష్టం దావా

**న్యూఢిల్లీ**

కాంగ్రెస్ పార్టీకి చెందిన ఖమ్మం మాజీ ఎంపీ రేణుకాచౌదరి శుక్రవారం సంచలన ట్వీట్ చేశారు. పరువు నష్టం కేసులో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ కోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఖమ్మం మాజీ ఎంపీ రేణుకాచౌదరి సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీపై పరువు నష్టం దావా వేస్తున్నట్లు ప్రకటించారు. తాను ఇప్పుడు ప్రధాని మోదీపై పరువు నష్టం కేసు వేస్తానని, ఇప్పుడు కోర్టులు ఎంత వేగంగా పనిచేస్తాయో చూస్తానని రేణుకాచౌదరి వ్యాఖ్యానించారు. 2018వ సంవత్సరంలో పార్లమెంట్‌లో 'శూర్పణఖ' అంటూ తనపై చేసిన ఆరోపణపై ప్రధాని నరేంద్ర మోదీపై పరువు నష్టం కేసు వేస్తానని కాంగ్రెస్ నాయకురాలు రేణుకా చౌదరి చెప్పారు. "ఇప్పుడు కోర్టులు ఎంత వేగంగా పనిచేస్తాయో చూద్దాం" అని మాజీ కేంద్రమంత్రి ట్వీట్ చేశారు.
రామాయణం సీరియల్ ప్రసారమైన కొన్ని రోజుల తర్వాత అలాంటి నవ్వు వినిపించినందున రేణుకా చౌదరిని కొనసాగించడానికి అనుమతించాలని నరేంద్ర మోదీ రాజ్యసభ ఛైర్మన్‌ను కోరిన క్లిప్ ను జత చేశారు.ప్రధాని మోదీ శూర్పణఖ అనే పదాన్ని ప్రస్తావించలేదని, పార్లమెంటులో చేసిన ప్రకటనపై ఆమె కోర్టుకు వెళ్లలేరని నెటిజన్లు వ్యాఖ్యానించారు.రాహుల్ గాంధీకి జైలు శిక్ష విధించిన నేపథ్యంలో శుక్రవారం పార్లమెంట్ నుంచి విజయ్ చౌక్ వరకు కాంగ్రెస్ నిరసన ప్రదర్శన నిర్వహించింది.విపక్షాల అంతరాయం మధ్య రాజ్యసభలో ప్రధాని మోదీ మాట్లాడుతున్నప్పుడు 2018 ఫిబ్రవరి 7వతేదీన ఈ గొడవ మొదలైంది.

# ప్రభుత్వ భూముల్లో సర్వేకు వచ్చిన విద్యుత్ అధికారుల వైఖరి మార్చుకోవాలి

**గడివేముల**



గడివేముల మండలంలోని కొర్రపోలూరు గ్రామంలో పేదల సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములలో గ్రామ ప్రజలు. రైతులు వ్యతిరేకిస్తున్న విద్యుత్ అధికారులు బలవంతంగా ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వే చేయడం దుర్మార్గమైన చర్య అని సర్వే పనులను వెంటనే నిలిపివేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి. ఎస్. బాబా ఫకృద్దీన్. ఒక ప్రకటనలో తెలిపారు.
ఈ సందర్భంగా పై నాయకులు మాట్లాడుతూ, కొర్రపోలూరు గ్రామంలో దశాబ్దాలుగా పేద రైతులు తమ జీవనాధారణ కోసం ప్రభుత్వ భూములలో సాగు చేసుకుంటుంటే అధికార పార్టీ నాయకుడు గడివేముల జడ్పీటిసి చంద్రశేఖర్ రెడ్డి. దౌర్జన్యంగా ఆక్రమించి బినామీలతో ఉన్న భూములను కాపాడేందుకు ప్రభుత్వ రెవెన్యూ. విద్యుత్ అధికారులు వత్తాసు పలకడం విచారకరమని జెడ్పీటిసి ఆక్రమించిన భూములను ప్రభుత్వ అధికారులు స్వాధీనం చేసుకొని వాటిలోనే విద్యుత్ ప్రాజెక్టు నిర్మించేందుకు ప్రభుత్వ అధికారులు చర్యలు చేపట్టాలని పేదల సాగు చేసుకుంటున్నా భూములకు కలెక్టర్ పట్టాలిచ్చేంత వరకు రైతులకు అండగా సిపిఐ జిల్లా సమితి.ప్రజా సంఘాలు.అండగా. తోడుగా నిలబడి ఆందోళన నిర్మించేందుకు సన్నద్ధమవుతామని. విద్యుత్ అధికారులు తమ వైఖరి మార్చుకొని రైతులను ఇబ్బంది లకు గురి చేయకుండా ఉండాలని. లేనిపక్షంలో ఉద్యమాల ద్వారా పై నాయకులు విజ్ఞప్తి చేశారు.

# టీడీపీ గూటికి గిరిధరరెడ్డి

**నెల్లూరు:**



కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి టీడీపీలో చేరికకు ఒకరోజు ముందే ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో ఈ కార్యక్రమం మరింత ప్రత్యేకంగా మారింది. కోటంరెడ్డి నెల్లూరు నుంచి పెద్ద సంఖ్యలో జనసమీకరణ చేసి మంగళగిరి వెళ్లారు. వైసీపీ పెట్టినప్పటి నుంచి కోటంరెడ్డి కుటుంబం జగన్ కు నమ్మకంగా ఉంటూ వచ్చింది. ఇటీవల కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం బయటపడిన తర్వాత ఓ దశలో పార్టీ అధిష్టానం ఆయన తమ్ముడు గిరిధర్ రెడ్డిని రూరల్ ఇన్ చార్జ్ గా ప్రకటించాలని చూసింది. కానీ పరిస్థితులు అనుకూలించలేదు. అన్నతోటే తన ప్రయాణం అని తేల్చి చెప్పారు గిరిధర్ రెడ్డి. దీంతో అధిష్టానం అక్కడ ఎంపీ ఆదాలను ఇన్ చార్జ్ గా ప్రకటించింది. నెల్లూరు రూరల్ లో అన్న పేరుతో అన్ని వ్యవహారాలను గిరిధర్ రెడ్డి చక్కబెడతారు. రూరల్ లో మారుమూల గ్రామాల్లో కూడా కోటంరెడ్డికి మంచి పట్టు ఉంది. అన్న బిజీగా ఉన్నా కూడా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆయన తరపున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేవారు. పార్టీతో సంబంధం లేకుండా తమకంటూ ఓ వర్గం ఏర్పాటు చేసుకున్నారు కోటంరెడ్డి సోదరులు. దీంతో వారిద్దరు వైసీపీని వీడినా రూరల్ ప్రజలు వారి వెంటే ఉన్నారు. వాస్తవానికి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కూడా టీడీపీ కండువా కప్పుకోవాల్సి ఉంది. కానీ పార్టీ ఫిరాయింపు పేరుతో వేటు వేస్తారనే భయం ఉంది. గతంలో టీడీపీ ఎమ్మెల్యేలు కూడా వైసీపీ వైపు వచ్చే సమయంలో వారికి నేరుగా జగన్ పార్టీ కండువాలు కప్పలేదు. వారి కుటుంబ సభ్యులకే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యేలు మాత్రం కండువాలు వేసుకోకపోయినా జగన్ కే జై కొట్టారు. పార్టీ ఫిరాయింపు ఆరోపణలను అలా వారు కవర్ చేసుకున్నారు. ఇప్పుడు కోటంరెడ్డి కూడా జగన్ ఫార్ములానే ఫాలో అవుతున్నారు. తాను పార్టీ మారకుండా తన తమ్ముడిని టీడీపీలోకి పంపిస్తున్నారు. కోటంరెడ్డి కూడా టీడీపీలో చేరితే పార్టీ పరంగా క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశముంది. కానీ ఇప్పుడు వైసీపీ చేతులు కట్టేసినట్టయింది. శ్రీధర్ రెడ్డి పార్టీ మారడంలేదు. ఆయన తమ్ముడు పార్టీ మారినా జగన్ చేసేదేమీ లేదు. అందుకే వైసీపీ టీమ్ సైలెంట్ గా ఉంది. జగన్ ఫార్ములానే ఫాలో అవుతూ కోటంరెడ్డి సోదరులు టీడీపీవైపు వచ్చేశారు. తనపై వేటు పడకుండా సేఫ్ గేమ్ ఆడారు శ్రీధర్ రెడ్డి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి విజయం వెనక కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఓటు కూడా ఉందనేది బహిరంగ రహస్యం. అంతరాత్మ ప్రభోదానుసారం తాము ఓటు వేశామని చెప్పారు రెబల్ ఎమ్మెల్యేలు. టీడీపీ అభ్యర్థి గెలవడంతో ఇప్పుడు వారు కూడా సంబరాలు చేసుకుంటున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తర్వాత కోటంరెడ్డి ఆఫీస్ దగ్గర సంబరాలు జరిగాయి. ఈరోజు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి అధికారికంగా టీడీపీలో చేరుతున్నారు. ఇకపై నెల్లూరు రూరల్ లో టీడీపీ వర్సెస్ వైసీపీ అన్నట్టుగా పోరాటం బలంగా జరిగే అవకాశముంది. ఇప్పటికే నెల్లూరు రూరల్ లో ఉన్న టీడీపీ నాయకుల్ని అధిష్టానం బుజ్జగించింది. వారికి నచ్చజెప్పి కోటంరెడ్డి సోదరుడు గిరిధర్ రెడ్డిని ముందుగా పార్టీలో చేర్చుకుంటున్నారు చంద్రబాబు. ఆ తర్వాత ఎన్నికల సమయంలో శ్రీధర్ రెడ్డికి రెడ్ కార్పెట్ పరిచే కార్యక్రమం ఉంటుంది.

# దక్షిణ మధ్య రైల్వే కు రికార్డు స్థాయి ఆదాయం

**సికింద్రాబాద్**



దక్షిణ మధ్య రైల్వే చరిత్రలోనే మొదటిసారిగా ప్రయాణికుల ఆదాయంలో రూ . 5000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించి, ఒక ప్రధాన మైలురాయిని సాధించింది. జోన్ లో ప్రయాణీకుల ద్వారా రూ. 5,000.81 కోట్లు ఆర్జించింది . ఇది 2019-20లో నమోదైన ఉత్తమ ఆదాయము రూ. 4,119.44 కోట్ల కంటే రూ. 881.37 కోట్లు అధికం అనగా 21% ఎక్కువ. వివిధ విభాగాల మధ్య సిబ్బంది సమన్వయంతో పాటు సమిష్టి కృషి వలన జోన్లోని ప్యాసింజర్ సెగ్మెంట్లో ఈ కొత్త మైలురాయి చేరుకునేందుకు సాధ్యమైంది .

కోవిడ్ లాక్డౌన్ తర్వాత ఎక్స్ప్రెస్ మరియు ప్యాసింజర్ రైళ్లను ప్రవేశపెట్టినప్పటి నుండి జోన్ నిరంతరం ప్రయాణీకుల రద్దీని సమీక్షిస్తోంది. భారతీయ రైల్వేలలో 100% మెయిల్ ఎక్స్ప్రెస్ రైళ్లను తిరిగి ప్రవేశపెట్టిన మొదటి జోన్లలో దక్షిణ మధ్య రైల్వే ఒకటి. ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టడం, కోచ్లను (శాశ్వతంగా మరియు తాత్కాలికంగా) పెంచడం మరియు సాధారణ రైళ్ల రాకపోకల స్థితిని (ఫ్రీక్వెన్సీ) పెంచడం వంటి ఇతర చర్యలు కూడా దీనికి ఉపకరించాయి .

కొన్ని రైళ్లలో నిరంతర డిమాండ్ను దృష్టిలో ఉంచుకుని, జోన్ పరిధిలోని వివిధ ఎక్స్ప్రెస్ రైళ్లలో శాశ్వతంగా 200 కోచ్లను పెంచింది, ఫలితంగా ఈ రైళ్లకు అధిక ఆదరణ లభించింది. అదనంగా, ప్రయాణీకుల సీజనల్ డిమాండ్ను తీర్చడానికి, ప్రస్తుత సంవత్సరంలో 200 అదనపు కోచ్లను కూడా తాత్కాలికంగా పెంచారు. వాస్తవానికి, ప్రయాణీకుల డిమాండ్ను రోజువారీ ప్రాతిపదికన పర్యవేక్షిస్తారు మరియు అదనపు డిమాండ్ను తీర్చడానికి సాధ్యమైన చోట అదనపు కోచ్లు జత చేస్తారు . వెయిట్లిస్ట్ చేసిన ప్రయాణీకులను క్లియర్ చేయడానికి ఎక్స్ప్రెస్ రైళ్లకు రోజువారీ ప్రాతిపదికన 10,539 కోచ్లు జతచేయబడ్డాయి దీని కారణంగా 9,83,559 మంది ప్రయాణికులు అదనంగా బెర్తను పొందారు, ఫలితంగా రైల్వేలకు రూ.81.28 కోట్ల అదనపు ఆదాయం వచ్చింది.

అదేవిధంగా, పండుగలు మరియు సెలవుల వేళల్లో ప్రయాణీకుల నుండి అదనపు డిమాండ్ను తీర్చడానికి, దసరా, దీపావళి, శబరిమలై, క్రిస్మస్/న్యూ ఇయర్, సంక్రాంతి, హోలీ ఇలా మొదలైన పండుగలకు దక్షిణ మధ్య రైల్వే 3,543 ప్రత్యేక రైళ్లను నడపడం ద్వారా 30.42 లక్షల మంది ప్రయాణికులను వివిధ గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా రూ.219.80 కోట్లు అదనపు ఆదాయం లభించింది. ఈ ఏడాది కొత్తగా రైళ్లను ప్రవేశపెట్టడం కూడా ఎంతో లబ్ది చేకూరింది . ముఖ్యంగా వందే భారత్ రైలు సికింద్రాబాద్ - విశాఖపట్నం - సికింద్రాబాద్ మధ్య ప్రవేశపెట్టడం భారతీయ రైల్వేలకు గర్వకారణం . అంతేకాకుండా, కాచిగూడ-మెదక్, అకోలా-అకోట్ మరియు బీదర్-కలబురగి మధ్య 7 జతల కొత్త రైలు సర్వీసులు ప్రవేశపెట్టబడ్డాయి. నాందేడ్-పూణె-నాందేడ్ ఎక్స్ప్రెస్ ఫ్రీక్వెన్సీని పెంచడం అనగా రెండు వారాలకు ఒక సారి ప్రయాణించే ఈ రైలు ఇప్పుడు ప్రతిరోజూ నడిచేలా చర్యలు తీసుకున్నారు ప్రయాణీకుల సౌకర్యం కోసం, 8 జతల ఎక్స్ప్రెస్ రైళ్లు ఎల్ హెచ్ బి రేక్లుగా మార్చడం జరిగింది . ఎల్ హెచ్ బి రైళ్ల యొక్క అధిక సామర్థ్యం కారణంగా ప్రయాణికులు అధిక సంఖ్యలో రైళ్ల లో ప్రయాణించేందుకు దారితీసింది. ఈ విధమైన చర్యలు చేపట్టడం మూలాన రైలు సేవల పట్ల ప్రయాణికుల మరింత ఆదరణను పొందేందుకు దోహదపడింది . దీని కారణంగా జోన్లోని ఎక్స్ప్రెస్ రైళ్ల 123% ఆక్యుపెన్సీ పెరగడం అనేది ప్రయాణికుల రద్దీ ప్రతిబింబిస్తోంది . ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 5,000 కోట్ల ప్రయాణీకుల ఆదాయాన్ని నమోదు చేసినందుకు దక్షిణ మధ్య రైల్వే సిబ్బందిని అభినందించారు. వివిధ శాఖల మధ్య పటిష్టమైన సమన్వయం మరియు అందుబాటులో ఉన్న వనరులను సమర్ధవంతంగా ఉపయోగించుకోవడం వల్ల మంచి ఫలితం లభించిందని ఆయన పేర్కొన్నారు. జోన్, అత్యుత్తమ పనితీరును సాధించడంలో మరియు ఈ ప్రీమియర్ జోన్ను నడిపించడంలో ఇది ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు . ప్రయాణీకుల డిమాండ్ను తీర్చడానికి జోన్ ఎల్లప్పుడూ అధిక ప్రాధాన్యతనిస్తుందని మరియు వారి ప్రయాణ అవసరాలను తీర్చడానికి అవసరమైన అన్ని చర్యలను కొనసాగిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# న్యాయ పోరాటానికి రాహుల్....

**న్యూఢిల్లీ :**
రాహుల్ గాంధీపై అనర్హతా వేటు వేస్తూ లోక్‌సభ సెక్రటరీ జనరల్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. దీనిపై కాంగ్రెస్ తీవ్రంగా మండి పడుతోంది. అయితే...ఇప్పుడు రాహుల్ ముందున్న ఆప్షన్స్‌పై చర్చ జరుగుతోంది. కేరళలోని వాయనాడ్ ఎంపీగా ప్రాతినిధ్యం వహించారు రాహుల్. ఇప్పుడు ఎంపీగా కొనసాగలేరని తేల్చి చెప్పిన నేపథ్యంలో...అక్కడ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చేందుకు అవకాశముంది. అంతే కాదు. సెంట్రల్ ఢిల్లీలోని ప్రభుత్వ బంగ్లా నుంచి రాహుల్ బయటకు వచ్చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు ఆయన ముందున్న ఒకే ఒక ఆప్షన్ న్యాయ పోరాటం. ఎన్నికల సంఘంతో సంప్రదింపులు జరిపిన తరవాత ఎంపీలపై అనర్హతా వేటు వేసే అధికారం కేవలం రాష్ట్రపతికి మాత్రమే ఉంటుందని గట్టిగా వాదిస్తోంది కాంగ్రెస్. అందుకే...లోక్‌సభ సెక్రటరీ జనరల్ తీసుకున్న నిర్ణయం చట్ట పరంగా చెల్లదని చెబుతోంది. కానీ బీజేపీ మాత్రం ఈ వాదనను కొట్టి పారేస్తోంది. ఈ నిర్ణయాన్ని కేవలం లోక్‌సభ స్పీకర్‌కు తెలియజేస్తే సరిపోతుందని వాదిస్తోంది. రాహుల్ గుజరాత్ హైకోర్టుకు అప్పీల్ చేసుకునేందుకు అవకాశముంది. ఈ కోర్టులోనూ అనుకూలంగా తీర్పు రాకపోతే...సుప్రీం కోర్టు వరకూ వెళ్లేందుకు వీలుంటుంది. ఒకవేళ సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పుని సుప్రీం కోర్టు వ్యతిరేకిస్తే అప్పుడు ఆయనకు కొంత ఊరట లభిస్తుంది. ఆ తీర్పుని సస్పెండ్ చేయడమే కాదు. దానిపై స్టే విధిస్తే కానీ రాహుల్‌పై పడిన వేటు రద్దవదు. అలా కాకుండా...కోర్టు ఈ తీర్పుని సమర్థిస్తే మాత్రం రాహుల్‌కు ఇంకే మార్గమూ ఉండదు. కచ్చితంగా చట్ట ప్రకారమే నడుచుకోవాల్సి ఉంటుంది. 8 ఏళ్ల పాటు ఎన్నికలకు దూరంగా ఉండక తప్పదు. ప్రస్తుతం రాహుల్ పై కోర్టులో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నట్టు కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి. రాహుల్ గాంధీపై అనర్హత వేటు పడింది. పరువు నష్టం కేసులో సూరత్ కోర్టు ఆయనను దోషిగా తేల్చడమే కాకుండా రెండేళ్ల జైలు శిక్ష కూడా విధించింది. అప్పటి నుంచి ఆయన పార్లమెంట్ సభ్యత్వం రద్దవుతుందన్న వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. అందుకు తగ్గట్టుగానే లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఆయనపై అనర్హత వేటు వేశారు. ఉదయం లోక్‌సభ సమావేశాలకు హాజరయ్యారు రాహుల్. ఆ తరవాతే ఈ నిర్ణయం తీసుకున్నారు సెక్రటరీ జనరల్.
"పరువు నష్టం దావా కేసులో రాహుల్ గాంధీని సూరత్ దోషిగా తేల్చింది. ఈ మేరకు కేరళలోని వాయనాడ్ ఎంపీగా ఉన్న ఆయనపై అనర్హతా వేటు వేస్తున్నాం. ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం రాజ్యాంగ బద్ధంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నాం" ప్రజాప్రతినిధుల చట్టం 1951 లోని సెక్షన్ 8 (3) ప్రకారం...ఎవరైనా పార్లమెంట్ సభ్యుడు లేదా సభ్యురాలు ఏదైనా నేరంలో దోషిగా తేలినా, కనీసం రెండేళ్ల జైలు శిక్ష పడినా ఆ సభ్యత్వాన్ని రద్దు చేస్తారు. ఈ కోర్టు తీర్పు ఆధారంగా...లోక్‌సభ సెక్రటేరియట్ రాహుల్‌పై చర్యలు తీసుకున్నారు. ఆయనపై అనర్హతా వేటు వేశారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న వాయనాడ్‌లో మళ్లీ ఎన్నికలు నిర్వహించే అవకాశాలూ ఉన్నాయి. అయితే...ఈ తీర్పుపై న్యాయ పోరాటం కొనసాగించేందుకు రెడీ అవుతోంది కాంగ్రెస్.












Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509036 RNI/APTEL/2021/80950